





సభలో మాట్లాడుతున్న యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అరుణకుమారి

పాత పింఛను ఇచ్చే పార్టీకే మద్దతు

యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అరుణకుమారి

కొవ్వూరు, మార్చి 10 : ఉద్యోగ, ఉపాధ్యాయులకు పాత పింఛను విధానాన్ని అమలుచేస్తామని మాటిచ్చిన రాజకీయపార్టీకే ఉపాధ్యాయ సంఘాలు మద్దతు తెలుపుతాయని యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్. అరుణకుమారి తెలిపారు. కొవ్వూరు ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో ఆదివారం యూటీఎఫ్ జిల్లా సహాయ అధ్యక్షురాలు విజయగౌరి అధ్యక్షతన నిర్వహించిన అంతర్జాతీయ మహిళా దినోత్సవంలో ఆమె మాట్లాడారు.వైసీపీ ప్రభుత్వం అధికారం చేపట్టిన వారం రోజుల్లో సీపీఎస్ విధానాన్ని రద్దు చేస్తామని చెప్పి ఉద్యోగులను దారుణంగా మోసం చేసిందన్నారు. పాత పింఛను విధానాన్ని ప్రభుత్వం పూర్తిగా తుంగలో తొక్కేసిందన్నారు. సీపీఎస్, జీపీఎస్ విధానాలను ఉపాధ్యాయ సంఘాలు పూర్తిగా వ్యతిరేకిస్తున్నాయన్నారు. మహిళలపై లైంగికదాడులు పెరిగిపోయి వారు పనిచేస్తున్న చోట భద్రత లేకుండా పోయిందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మహిళల భద్రతకు చట్టాలు చేసి చిత్తశుద్ధితో అమలు చేయాలన్నారు. రానున్న ఎన్నికల్లో మహిళలకు సీట్లు పెంచి వారిలో ఆత్మస్థయిర్యాన్ని నింపాలన్నారు. జీవో నెంబరు 177ను రద్దు చేయాలన్నారు. ఇప్పటికైనా సీఎం జగన్ పాదయాత్రలో ఇచ్చిన హామీ మేరకు ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించి, సీపీఎస్‌ను రద్దుచేసి పాత పింఛను విధానాన్ని అమలు పర్చాలని డిమాండ్ చేశారు. ఐద్వా జిల్లా అధ్యక్షురాలు జరీనా మాట్లాడుతూ ఉపాధ్యాయుల రెండేళ్ల అప్రంటీస్ విధానాన్ని ఉపసంహరించాలన్నారు. జిల్లా బాలోత్సవ కమిటి కన్వీనర్ ఇ.శ్రీమణి మాట్లాడుతూ పిల్లల సంరక్షణకై కేంద్ర ప్రభుత్వం మాదిరిగా రాష్ట్ర ప్రభుత్వం రెండేళ్ల చైల్డ్‌కేర్ లీవులను మంజూరు చేయాలన్నారు. మహిళలకు పోటీలు నిర్వహించి బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు పి.జయకర్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.షరీఫ్, రూపస్, ఇవీఎస్ఎస్ఆర్.ప్రసాద్, రమేష్, ఎస్.భవాని, ఎస్.అనిత, ఐ.రాజేశ్వరి, శ్రీనివాస్, ప్రకాష్, అంగన్వాడీ జిల్లా కార్యదర్శి కె.బేబిరాణి, ఆశా యూనియన్ అధ్యక్షురాలు ఎన్. అన్నామణి పాల్గొన్నారు.

కొవ్వూరు డీవైఈవోగా వాసుదేవరావు



కొవ్వూరు, మార్చి 10 : ఎట్టకేలకు కొవ్వూరు విద్యా డివిజన్ ఏర్పాటు చేశారు. జిల్లా విద్యాశాఖాధికారిగా విధులు నిర్వహిస్తున్న కె.వాసుదేవరావు ఆదివారం రాత్రి కొవ్వూరు డివిజన్ ఉప విద్యాశాఖాధికారిగా (పూర్తి అదనపు బాధ్యతలు) ఎఫ్ఏసీగా బాధ్యతలు స్వీకరించారు. రాష్ట్రంలో కొత్త జిల్లాలు ఏర్పడిన నాటి నుంచి ఇప్పటి వరకు కొవ్వూరు డివిజన్‌లో విద్యా డివిజన్ ఏర్పడలేదు. 18 మంది ఎంఈవోలు, 82 ఉన్నత పాఠశాలలు ఉపాధ్యాయులు ఉన్న కొవ్వూరు డివిజన్‌కు కె.వాసుదేవరావును డివిజనల్ ఉప విద్యాశాఖాధికారిగా నియమించడం పట్ల టీచర్లు హర్షం వ్యక్తం చేస్తున్నారు. స్థానిక ఎంఈవో కార్యాలయంలోనే ఆదివారం వాసుదేవరావు బాధ్యతలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో రాజమహేంద్రవరం డివిజన్ ఉప విద్యాశాఖాధికారి ఈవీబీఎన్. నారాయణ, ఎంఈవోలు జె.కెంపురత్నం, రామకిషోర్, ప్రసాద్, ప్రధానోపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ శివరాత్రి ఆదాయం రూ.10.91 లక్షలు

రాజమహేంద్రవరం అర్బన్, మార్చి 10 : మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని జిల్లాలోని వివిధ పుణ్యక్షేత్రాలకు స్పెషల్ సర్వీసులు నడపడం ద్వారా జిల్లా ఆర్టీసీ రూ.10,91,730లు ఆదాయం ఆర్జించినట్టు ఆర్టీసీ జిల్లా అధికారిణి షర్మిల అశోక ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని గోకవరం, కొవ్వూరు, నిడదవోలు, రాజమహేంద్రవరం డిపోల నుంచి మొత్తం 59 స్పెషల్ సర్వీసులు నడపడం ద్వారా 29,400 మంది ప్రయాణీకులకు సేవలందించగా మంచి ఆదాయం లభించిందన్నారు.

జగన్ సిద్ధం సభకు 30 ఆర్టీసీ బస్సులు

రాజమహేంద్రవరం, మార్చి 10 (ఆంధ్రజ్యోతి) : గుంటూరు జిల్లా అద్దంకిలో జరిగిన వైసీపీ సిద్ధం సభకు రాజమహేంద్రవరం ఆర్టీసీ డిపో నుంచి 30 బస్సులను తరలించారు. కానీ ఇక్కడ నుంచి జనం లేరు. ఆయా ప్రాంతాల్లోని జనాన్ని తరలించడానికి బస్సులు పురమాయించారు.

మద్యంపై మాట తప్పారు.. ఓటెలా అడుగుతారు!



అది 2019 మే 26.. తన ప్రమాణ స్వీకారానికి ప్రధానిని, ఇతర ప్రముఖులను ఆహ్వానించడానికి జగన్ హస్తినకు వెళ్లారు. అప్పుడు.. అంటే అదే రోజున దేశ రాజధానిలో మీడియా సమావేశంలో మాట్లాడారు. వైసీపీ మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మద్యపాన నిషేధంపై పాత్రికేయులు ప్రశ్నించారు. అప్పుడు జగన్ "మద్యపాన నిషేధానికి సంబంధించి నేను చాలా క్లియర్‌గా చెప్పాను. క్రమంగా అమలు చేస్తాం. దశల వారీ పద్ధతుల్లో నిషేధిస్తామనే చెప్పాం. దానికి కట్టుబడి ఉన్నాం. 2024 ఎలక్షన్స్ సమయానికి మాత్రం కచ్చితంగా మద్యాన్ని ఫైవ్‌స్టార్ హోటల్స్‌కి మాత్రమే పరిమితం చేసిన తర్వాతే 'నేను ఓట్లు అడుగుతాను. అది మాత్రం కచ్చితంగా చెప్పి ఉన్నాను'. మేనిఫెస్టోలో కూడా కరెక్టుగా ఇదే చెప్పాను. మేనిఫెస్టోని నేను ఖురాన్, బైబిల్, భగవద్గీతగా భావిస్తాను" అని వ్యాఖ్యానించారు. అయితే అధికారంలోకి వచ్చిన వెంటనే అవే మతగ్రంథాల 'సాక్షి'గా హామీని మద్యంలో ముంచేశారు. ఇదీ జగన్ సర్కారు వారి బూటకపు మాటల మద్య నిషేధ కథా చిత్రమ్.

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

మాట తప్పి మడమ తిప్పి మళ్లీ ఇప్పుడు ఎన్నికల్లో మేనిఫెస్టోతో ఓట్లు దండుకోవడానికి 'సిద్ధం' అయ్యారు. మద్యం అమ్మకాలను తగ్గించడం దేవుడెరుగు!.. మద్యం అమ్మకాల ఆదాయం పైనే ప్రభుత్వాన్ని ఇన్నేళ్లు నడిపించడం చూస్తే జగన్ ఉల్టా మాటలు నమ్మిన జనాన్ని పల్టీ కొట్టించారని అర్థమవుతోంది.ఆయన 2019 మే 30న సీఎంగా ప్రమాణం చేశారు. మరో మూడు నెలల్లో ఆయన ప్రమాణానికి ఆయువు తీరుతుంది. కానీ ఆయన ఖురాన్, బైబిల్, భగవద్గీతలా భావించే మేనిఫెస్టోలోని మద్యపాన నిషేధ హామీని నేటి వరకూ అమలు చేయలేకపోయారు. పైగా మద్యంపై వచ్చే ఆదాయాన్ని పరుగులు పెట్టించారు. మద్యం అమ్మకాలను తగ్గించకపోగా ప్రోత్సహిస్తూ 'సీసాలు వేరు వాటిలోని సారా ఒకటే' అనే చందంగా నాణ్యతను దిగజార్చారు.ఐదేళ్లుగా రంగుసారాను ఏరుల్లా పారించి జనాల ఊపిరిని గుటుక్కుమనిపించారు. దేశంలో ఏ సీఎం చేయని విధంగా మద్యంపై రానున్న 15 ఏళ్లలో వచ్చే ఆదాయాన్నితాకట్టుపెట్టి వేల కోట్ల రూపాయలు అప్పు తెచ్చిన పాలకుడిగా చరిత్రలో నిలిచారు. గతంలో ఎన్నడు లేని ధర కుటుంబాలను ఆర్థికంగా ఛిద్రం చేస్తుంటే.నాణ్యతలేని సరుకు ఆరోగ్యాన్ని నాశనం చేస్తోంది.

జేబుకు చిల్లు.. ఆరోగ్యం గుల్ల

పేదోళ్లు.. మధ్యతరగతి మందుబాబులు.. పెగ్గు అలవాటైన ప్రాణాలు. పగలంతా శ్రమించి ఓ చుక్క గొంతులో పోసుకొని సేదతీరదామను కొనే చిన్న బతుకులు.. పెగ్గు గొంతులో పోసుకోలేని దుస్థితి.జగన్ ప్రభుత్వం వచ్చాక రోజువారీ శ్రమలో అధికశాతం సర్కారుకు మద్యం రూపంలో ముట్టజెబుతున్నారు. ఆరోగ్యాన్నీ పణంగా పెడుతున్నారు. ఈ ఐదేళ్లలో నాణ్యతలేని, కల్తీ మద్యం తాగడం వల్ల ప్రాణాలను సర్కారుకు అర్పించిన వారిలో అధికశాతం పేదలే ఉన్నారు. ఒకేసారి పది మందికిపైగా చనిపోయిన ఘటనలు ఉన్నాయి. వైసీపీ ప్రభుత్వం వచ్చిన వెంటనే మద్యం పాలసీని ప్రపంచంలోనే ఎవరూ ఊహించని కొత్త అడ్డదార్లు తొక్కించారు. ప్రభుత్వ మద్యం దుకాణాలను తెరపైకి తెచ్చారు. ధరలను విపరీతంగా పెంచేశారు. గత ప్రభుత్వంలో గజిబిజి మద్యం పాలసీ ఉండేది కాదు. అప్పుడు క్వార్టరు(180ఎంఎల్) నాణ్యమైన సరుకు రూ.120కే దొరికేది. ఆ ధరను అమాంతం రూ.200 చేసేశారు. 'జే' బ్రాండ్లతో షాపులను నింపేశారు. తర్వాత దశల వారీగా అమ్మకాలు ఎక్కువగా ఉన్న బ్రాండ్లకు మళ్లీ క్వార్టరుకు రూ.30 అదనంగా తగిలించారు. ఇలా క్వార్టరు రూ.230 అయిపోయింది. సారా వల్ల ఆరోగ్యాలకు ఇబ్బంది కలుగుతోందని గ్రహించిన గత ప్రభుత్వ పాలకులు చీప్ లిక్కర్‌ని అందుబాటులోకి తెచ్చారు. ఈ మందు ప్రమాణాల ప్రకారం డిస్టిలరీల్లో తయారయ్యేది. అయినా దాని ధర మాత్రం రూ.60 మించలేదు. ఇప్పుడు రంగు సారాను, హానికర రసాయనాలను సీసాల్లో నింపి రూ.150కి విక్రయిస్తున్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో లైసెన్సు పొందిన మందు షాపులు ఉండేవి. ఎంఆర్పీపై ఒక్క రూపాయి కూడా అధికంగా వినియోగదారుల వద్ద నుంచి తీసుకోకుండా ప్రభుత్వమే దుకాణదారులకు 15 శాతం కమిషన్ ఇచ్చేది.వైసీపీ ప్రభుత్వం వచ్చాక ఆ విధానాన్ని తీసేసింది. అసలే ఎంఆర్పీ అధికమంటే దానిపై ఎంత ఎక్కువకైనా అమ్ముకోవచ్చంటూ బార్‌లకు ధరలను ధారాదత్తం చేస్తూ ఆదేశాలు ఇచ్చేసింది. దీంతో గత ప్రభుత్వంలో రూ.60కి దొరికే చీప్ లిక్కర్ ఇప్పుడు బార్‌లో కొనాలంటే రూ.210 అవుతోంది. రోజంతా కష్టపడితే రూ.500 వస్తే గతంలో సుమారు రూ.400 ఇంటికి తీసుకెళ్లేవారు. మద్యం అలవాటు ఉన్న వాళ్లు ఇప్పుడు రూ.100కూడా కొంపకు చేర్చడం కష్టమవుతోంది. దీంతో కుటుంబాలు ఆర్థికంగా చితికిపోతున్నాయి. పైగా నాణ్యత లేని మద్యం, కల్తీ మద్యం వల్ల ఆరోగ్యాలు దెబ్బతింటున్నాయి. దీంతో జనాలు అనారోగ్యాలపాలై ఆస్పత్రుల ఖర్చులకు అప్పులపాలు అవుతున్నారు. లివర్, కిడ్నీ, గుండె సంబంధిత వ్యాధులు ఈ మూడేళ్లలో విపరీతంగా పెరిగిపోయాయి.ఎన్నో ఏళ్ల నుంచి మద్యం అలవాటు ఉన్న వారికి ఈ ఐదేళ్లు విషమ పరీక్షలు పెట్టింది.శరీరంలోని అవయవాలను నాశనం చేసింది.


2024కి మద్య నిషేధం చేయకపోతే ఓటు అడగనన్న జగన్

- దశల వారీ మద్య నిషేధం గాలికి
- జిల్లాలోనే 158 షాపులు
- పేరుకే ప్రభుత్వ మద్యం దుకాణాలు
- విచ్చలవిడిగా సాగుతున్న అమ్మకాలు
- భారీగా ధర పెంచేసిన ప్రభుత్వం
- తాగుబోతుల జేబుకు చిల్లు
- చిరుకుటుంబాల్లో కల్లోలం
- నాణ్యత లేని బ్రాండ్లు
- చెడిపోయిన పేదోడి ఆరోగ్యం
- పెరిగిన బెల్ట్, సారా దుకాణాలు
- నేడు సిద్ధమంటూ జగన్ సభలు



మద్యంతో కుటుంబాలు ఛిన్నాభిన్నం..

సీతానగరం మండలం రఘుదేవరపురంలో వైఎస్ఆర్ ఆసరా సభను ఆదివారం నిర్వహించారు. ఈ సభకు నయానో భయానో పెద్ద ఎత్తున మహిళలను తరలించారు.. చాలా మంది మహిళలు వచ్చారుగా స్పందన ఎలా ఉందో చూద్దామని మైక్ ఇచ్చి మాట్లాడమన్నారు.. అంతే ఒక పెద్దావిడ పేరు మంగమ్మ లేచింది.. మద్యంతో కుటుంబాలు ఛిన్నాభిన్నం అవుతున్నాయి.. వీధికో బ్రాందీషాపు పెట్టేశారు.. మద్యం నిషేధం చేస్తామన్నారు.. ఏమైందని ప్రశ్నించారు..అంతే వైసీపీ నాయకులు అవాక్కయ్యారు. వెంటనే మైక్ లాగేసుకున్నారు.. - సీతానగరం



మళ్లీ సారా కోరల్లో పేదోడు

వైసీపీ ప్రభుత్వం వచ్చాక మళ్లీ సారా మహమ్మారి కోరల్లో పేదోడు చిక్కుకున్నాడు. ప్రభుత్వ మద్యం దుకాణాల్లో రంగుసారా.. బయట రంగులేనిసారా నిర్విరామంగా లభ్యమవుతోంది. సారా అరికట్టడానికి ఎస్ఈబీ అనే విభాగాన్ని వైసీపీ ప్రభుత్వం సృష్టించినా ఆ మేరకు ఫలితాలు కానరాని పరిస్థితి. దీంతో పోలీసులు అడపాదడపా తలచుకుంటేనే వందల లీటర్ల సారా, బెల్లం ఊట బయపడుతోంది. గత ప్రభుత్వంలో నాణ్యమైన మందును చీప్ పేరుతో రూ.60కే క్వార్టరు అందుబాటులోకి తేవడంతో సారా వాడకం గణనీయంగా తగ్గింది. దీంతో తయారీదారులు కనుమరుగయ్యారు. వైసీపీ ప్రభుత్వం వచ్చాక మళ్లీ వారి వ్యాపారం మూడు ప్యాకెట్లు ఆరు సీసాలు అనే మాదిరిగా నడుస్తోంది. చీప్‌కి సారాకి నాణ్యతలో తేడా లేకపోవడం.. ధరల్లో భారీగా వ్యత్యాసం ఉండడంతో పేదలు సారావైపు మళ్లీ విపరీతంగా మళ్లారు. వేల లీటర్లలో సారా తయారు అవుతూ పట్టణాలకు సైతం సరఫరా అవుతోంది. చాలా చోట్ల సారా దుకాణాలు బెల్టుషాపులుగానూ అప్‌గ్రేడ్ అయ్యాయి. దీంతో ప్రభుత్వ మద్యం, సారా రెండూ అక్కడే లభ్యమవు తున్నాయి. మద్యం అమ్మకాల ద్వారా ఆదాయం పెంపుపై తీవ్రంగా దృష్టి సారిస్తున్న ప్రభుత్వం టార్గెట్లు పెట్టి మరీ ఎక్సైజ్ శాఖపై బాగా ఒత్తిడి పెంచుతోంది. పండుగల వేళ అది మరీ అధికరం. దీంతో జనాలతో ఫూటుగా తాగిస్తున్నారు. తూర్పుగోదావరి జిల్లాలో 137 మద్యం దుకాణాలు, 21 బార్లలో మద్యం లభ్యమవుతోంది. వీటిలో అధికంగా జిల్లా కేంద్రమైన రాజమహేంద్రవరంలోనే ఉన్నాయి. 19మండలాల్లో 158మద్యం దుకాణాలు చాలవన్నట్టుగా వాక్‌ఇన్ స్టోర్స్‌ని ప్రభుత్వం మొదలుపెట్టింది. ఇప్పుడు వీటికి బెల్టుషాపులు జతకలిశాయి. గతంలో మందు కావాలంటే ప్రభుత్వం లైసెన్సు ఇచ్చిన షాపునకు వెళ్లి కొనుక్కోవాల్సిందే. కానీ ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. గడప గడపకూ మందు అందాలన్నదే జగన్ ప్రభుత్వ లక్ష్యంగా కనిపిస్తోందనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ప్రభుత్వ మద్యం దుకాణం.. వాక్‌ఇన్ స్టోర్స్. బార్లు.. ఆ పది అడుగులు కూడా వేయలేమనంటే ఇంటి సమీపంలోనే బెల్టు షాపు. అక్కడ కొనుక్కొనేంత డబ్బులు లేవంటే దగ్గలోరే సారాయిదుకాణం. ఇవన్నీ కలుపుకొంటే జిల్లాలో సారాయి దుకాణాలు, బెల్టుషాపులు కలిపి వందల్లో నడుస్తున్నట్టు తెలుస్తోంది. ఇలా అందుబాటులో ఉన్న అన్నిచోట్లా మద్యం లభ్యమవుతోంది. జిల్లాలో మద్యం అమ్మకాలు నెలకు రూ.100 కోట్లు దాటాయంటే జనం సొమ్ము ఎంత పెద్ద మొత్తంలో ఖజానాకు చేరుతోందో అర్థం చేసుకోవచ్చు.

దగా జగన్‌కి బుద్ధి చెబుతాం

మద్య నిషేధమంటూ దగా మాటలు చెబుతారని మహిళలు అంటున్నారు. మద్యం ధరల వల్ల మగాళ్లు అప్పులపాలు అవుతున్నారని, ఇంటికి కష్టార్జితం చేరడం లేదని ఆవేదన చెందుతున్నారు. నాణ్యతలేని మందు వల్ల ప్రాణాలు పోగొట్టుకుంటూ కుటుంబాలను రోడ్డున పడేస్తున్నారంటూ ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఏపీ మహిళా సమాఖ్యలోని ఓ నాయకురాలు ఆవేదన వ్యక్తం చేస్తూ "కల్తీ మద్యం అమ్మకాల వల్ల పేదల బతుకులు నాశనమవుతున్నాయి. తాము అధికారంలోకి వస్తే మద్య నిషేధం విధిస్తామని చెప్పిన జగన్ ఇచ్చిన హామీని అమలు చేయకపోగా మద్యం అమ్మకాలను ప్రోత్సహిస్తున్నారు. కల్తీ మద్యం వల్ల అనేక మంది చనిపోతున్నారు. కుటుంబాలు రోడ్డున పడుతున్నాయి. ఈ ఎన్నికల్లో వైసీపీ ప్రభుత్వానికి బుద్ధి చెప్పడానికి మహిళలంతా సిద్ధంగా ఉన్నారు" అని స్పష్టం చేశారు. దీనికి కారణం లేకపోలేదనేది నిష్ఠుర సత్యం. జిల్లాలోని ప్రభుత్వ మద్యం దుకాణాలు ఉదయం 10 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకూ అమ్మకాలు సాగించాలి. బార్లు మరో రెండు గంటలు అదనంగా అమ్ముకోవచ్చు. ఈ సమయాలు ప్రభుత్వ ఉత్తర్వులకే పరిమితం అని చెప్పొచ్చు. గ్రామాల్లో ప్రభుత్వ మద్యం షాపుల్లో రాత్రి 10 గంటల వరకూ అమ్ముతున్నారు. సారాయి దుకాణాలు, బెల్టుషాపులకు సమయమంటూ ఏమీ విధించలేదు. ఉదాహరణకు రాజమహేంద్రవరంలో అర్ధరాత్రి ఒంటిగంటకు కూడా మద్యం దొరుకుతుందంటే ఫూటుగా తాగించడంలో పాలకుల కృషిని కచ్చితంగా తూర్పారబట్టాల్సిందే.

ఫ్యాన్ గాలి వీచడం లేదు..!

- వైసీపీ బీసీ సదస్సులకు స్పందన కరువు
- తాయిలాలతో పార్టీ నాయకుల వల

రాజమహేంద్రవరం, మార్చి 10 (ఆంధ్రజ్యోతి) : వైసీపీ ఆత్మీయ సమావేశాలకు స్పందన కరువవుతోంది. వైసీపీ అధిష్ఠానంపై ప్రజలకు ఉన్న అసంతృప్తి కారణంగా స్థానిక నేతలెవరూ పట్టించుకునే పరిస్థితి కనిపించడంలేదు. సమాజంలోని అన్ని కులాల్లో సంఘ నేతలు, కొందరు చురుకుగా ఉండేవారిని ఏరి వారితో ఆత్మీయ సమావేశాలు పెట్టి, భోజనం ఏర్పాటు చేసి గిఫ్టులు ఇస్తున్నారు. కానీ వీటికి సాధారణ జనాలు రావడంలేదు. కొవ్వూరు, నిడదవోలు నియోజకవర్గాల పరిధిలో శనివారం రాత్రి జరిగిన బీసీ సదస్సుకు పెద్దగా స్పందన లేదు. కొవ్వూరు పరిధిలోని బీసీల సదస్సు చాగల్లులో ఏర్పాటు చేయగా బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య హాజరయ్యారు. అయినా పెద్దగా స్పందన లేదు. పెరవలి మండలం పరిధిలో పరిస్థితి అంతే. రాజమహేంద్రవరం మార్గాని ఎస్టేట్‌లో సిటీ , రూరల్, లోక్‌సభ పరిధి అభ్యర్థులు ఏర్పాటు చేసిన గౌడ శెట్టిబలిజ ఆత్మీయ సమావేశానికి కనీస స్పందన లేదు. సుమారు 4 వేల మంది వస్తారని భోజనం ఏర్పాట్లు, టెంట్లు వేశారు.ఉదయం 9 గంటలకు అని చెప్పినా 12 గంటలకు 100 మంది హాజరు కాలేదు.దీంతో ఇతర బీసీలు, పార్టీ కార్యకర్తలను రప్పిస్తే సుమారు 300 నుంచి 400 మంది హాజరైనట్టు సమాచారం. ఖాళీ కుర్చీలు కనిపించకుండా వేసిన కుర్చీలు తీసేసి, టెంట్లు కూడా సర్దుబాటు చేయడం గమనార్హం. ఇక విలేకరులతో ఆత్మీయ సమావేశాలు జరుగుతున్నాయి. గోపాలపురంలో శనివారం రాత్రి హోంమంత్రి తానేటి వనిత విలేకరులను పరిచయం చేసుకుని విందు ఇచ్చారు.. గిఫ్టులు పంపిణీ చేశారు. నియోజకవర్గంలో ఎక్కడ పరిస్థితి ఎలా ఉంది.. తాము ఏం చేయాలో సలహాలు చెప్పమని కోరడం గమనార్హం. నలుగురైదుగురు తప్ప ఇంకెవరూ స్పందించలేదు. చివరకు అందరూ సహకరించాలని చెప్పి పంపించడం గమనార్హం. సీతానగరంలో ఏర్పాటు చేసిన మీటింగ్ మహిళలు మద్యంపై గళమెత్తడంతో నిర్వాహకులు ఇబ్బందులు పడ్డారు. అనపర్తిలో ఆశావర్కర్లు, డ్వాక్రామహిళలు, వలంటీర్లతో సమావేశాలు నిర్వహించి, ఓట్లు వేయించవలసిందిగా కోరుతు న్నారు.ఇంతకాలం కార్యకర్తలను పట్టించుకోకపోవడం వల్ల వలంటీర్లు, ప్రభుత్వ ఉద్యోగుల మీదే వైసీపీ ఎక్కువగా ఆధారపడుతోంది.ఉద్యోగుల్లో ప్రభుత్వం పట్ల వ్యతిరేకత ఉన్న సంగతి తెలిసిందే. ఈ వైసీపీ నేతల ఒత్తిడి నుంచి బయట పడేందుకు.. ఎప్పుడు ఎన్నికల షెడ్యూల్ వస్తుందా అని ఉద్యోగులు ఎదురుచూస్తున్నారు.

ఆత్మీయ సమావేశం పేరిట..తాయిలాలు



దేవరపల్లి, మార్చి 10 : ఎన్నికలు దగ్గర పడడంతో అన్ని వర్గాలకు వైసీపీ నాయకులు, ప్రజాప్రతినిధులు తాయిలాలు అందజేస్తున్నారు. దేవరపల్లి కాకర్ల కల్యాణ మండపంలో ఆదివారం వలంటీర్లు, ఆశావర్కర్లు, అంగ న్వాడీలకు మంత్రి తానేటి వనిత ఆత్మీయ సమావేశం ఏర్పాటు చేశారు. మంత్రి తానేటి వనిత మాట్లాడి వెళ్లిన తరువాత విందు ఇచ్చారు. అనంతరం హాట్‌బాక్స్, ఫ్లాస్క్ గిఫ్టుల పంపిణీ చేపట్టారు. ఆత్మీయ సమావేశం రసాబాస జరిగింది. పార్టీ పదవుల్లో స్థానికంగా ఉన్న వారికి దేవరపల్లిలో జరిగే కార్యక్రమమైనప్పటికీ ప్రాధాన్యత ఇవ్వలేదని ఒకరికొకరు వాగ్వాదం చేసుకున్నారు. దీంతో కొంత సేపు నాయకుల మధ్య రసాబాసగా జరిగింది.

మహిళకైతే చీర.. పురుషుడికైతే ప్యాంటు, షర్టు



కోరుకొండ, మార్చి 10 : ఎన్నికలు దగ్గర పడుతున్న వేళ అధికార వైసీపీ రాజానగరం నియోజకవర్గంలో గ్రామ స్థాయిలో పని చేసే సిబ్బందికి తాయిలాలతో వల వేస్తోంది. ప్రతి గ్రామంలోను సచివాలయ పరిధిలో పనిచేసే సిబ్బందికి నూతన దుస్తుల సంచులు చేరుతున్నాయి. వలంటీర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశ వర్కర్లకు, ఉపాధి హామీ క్షేత్రస్థాయి సహాయకులు, పారిశుధ్య కార్మికులకు బహుమతుల పేరుతో మహిళలకు చీరలు, పురుషులకు ప్యాంట్, షర్టులు అందంగా ప్యాక్ చేసి బ్యాగ్‌లో పెట్టి ఇస్తున్నారు. ఈ బ్యాగ్‌పై సీఎం జగన్, ఎమ్మెల్యే జక్కంపూడి రాజా చిత్రాలు ముద్రించారు. గ్రామాల్లో వైసీపీ నాయకులు, ముఖ్య అనుచరుల ఆధ్వర్యంలో బహుమతుల పంపిణీ చురుగ్గా జరుగుతుంది.

కూటమి విజయం ఖాయం



శంఖారావం సభా వేదికపై టీడీపీ-జనసేన జెండాలతో ఎంపీ రామ్మోహన్‌నాయుడు, ఉమ్మడి అభ్యర్థి ఆదిరెడ్డి వాసు

- ఐదేళ్లు రాజమండ్రిని భ్రష్టు పట్టించిన వైసీపీ
- ఉమ్మడి అభ్యర్థి ఆదిరెడ్డి శ్రీనివాస్‌ని గెలిపించాలి
- ఎన్నికల శంఖారావం సభలో రామ్మోహన్‌నాయుడు

రాజమహేంద్రవరం సిటీ, మార్చి 10 : రాజమహేంద్రవరానికి ఎంతో గొప్ప చరిత్ర ఉంది. ఈ నేలపై కందుకూరి వీరేశలింగపంతులు వంటి మహనీయులు నడయాడారు.అటువంటి నగరాన్ని ఈ ప్రబుద్ధుడు భరత్ రామ్ నేరాల మయంగా మార్చేశాడని శ్రీకాకుళం ఎంపీ కింజరపు రామ్మోహన నాయుడు ధ్వజమెత్తారు. రాజమహేంద్రవరం జెమినీ గ్రౌండ్స్‌లో ఆదివారం రాత్రి జరిగిన టీడీపీ-జనసేన ఎన్నికల శంఖారావం సభ నిర్వహించారు. టీడీపీ వ్యవస్థాపకుడు ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులర్పించారు. టీడీపీ-జనసేన ఉమ్మడి అభ్యర్థి ఆదిరెడ్డి శ్రీనివాస్ ఎన్నికల శంఖారావం పూరించి సభను ప్రారంభించారు. అనంతరం రామ్మోహననాయుడు మాట్లాడుతూ రాజమహేంద్రవరం నగరానికి ఎంతో చరిత్ర ఉందన్నారు. ఇటువంటి నగరానికి ఐదేళ్లు బూజుపట్టిందన్నారు. రాష్ట్రంలో ఈ వైసీపీ వాళ్లు కేవలం సిద్ధం ఫ్లెక్సీలకే రూ.700 కోట్లు ఖర్చుచేసి పబ్లిసిటీకి అత్యధిక ప్రాధాన్యత ఇచ్చారని చెప్పారు. మీ ఇష్టం వచ్చినట్టు అన్నిగోడలపై ఫ్లెక్సీలు వేసుకోండి ప్రజల గుండెల్లో మాత్రం టీడీపీ-జనసేన ముద్ర వేసుకుందన్నారు. రాజమహేంద్రవరంలో టీడీపీని కొట్టగల దమ్ము ఏ పార్టీకి లేదన్నారు. గత ఎన్నికల్లో మనం నిరూపించామన్నారు. గతంలో 23 మంది టీడీపీ ఎమ్మెల్యేలు గెలిస్తే రాజమహేంద్రవరం నుంచి ఎమ్మెల్యేగా గెలిచిన ఆదిరెడ్డి భవానికి అత్యధిక మెజార్టీ ఇచ్చారని ..ఈ దఫా లక్ష మెజార్టీ రావాలన్నారు. ఎన్నికల కోడ్ నాలుగైదు రోజుల్లో వస్తుందని అప్పుడు అధికారులు కూడా వైసీపీ వాళ్ల మాట వినే పరిస్థితి ఉండదన్నారు. ఆదిరెడ్డి వాసు ఒక కమిట్‌మెంట్‌తో ప్రజలకు సేవ చేసే మనస్తత్వం కలిగిన నాయకుడు అవకాశం ఇస్తే నగరాన్ని అభివృద్ధి చేసి చూపిస్తారన్నారు. చంద్రబాబును ప్రజల్లోకి వెళ్లకుండా జగన్ కుట్రచేసి రాజమహేంద్రవరం సెంట్రల్ జైలులో పెట్టారు. అప్పుడు బాధ్యత గల నాయకుడిగా పవన్ కల్యాణ్ వచ్చి రాష్ట్రంలో పిచ్చికుక్కను తరిమివేయాలని ఇక్కడే పొత్తు ప్రకటించారని గుర్తుచేశారు. జోన్-2 కోఆర్డినేటర్ రంగారావు మాట్లాడుతూ రాష్ట్రాన్ని సర్వనాశనం చేసిన జగన్‌ను ఇంటికి సాగనంపాలన్నారు. టీడీపీ-జనసేన-బీజేపీ కూటమిని ఆదరించి ఆదిరెడ్డి శ్రీనివాస్‌ను గెలిపించాలని పిలుపునిచ్చారు.మాజీ మంత్రి జవహర్ మాట్లాడుతూ ఆదిరెడ్డి శ్రీనివాస్ ఎన్నికల శంఖారావం సభకు వచ్చిన ఈ జనాన్ని చూసి తాడేపల్లి టీవీలు పగులుతాయన్నారు. మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు మాట్లాడుతూ వాసును మనసారా ఆశీర్వదించి అసెంబ్లీకి పంపాలన్నారు.గన్నికృష్ణ మాట్లాడుతూ విజయోత్సవ సభలా ఉందని.. ఆదిరెడ్డి వాసు గెలిచేశాడన్నారు. జనసేన ఇన్‌చార్జి అనుశ్రీ సత్యనారాయణ మాట్లాడుతూ సభ్యత సంస్కారం లేని భరత్‌రామ్‌కు ప్రజలే తగిన గుణపాఠం చెబుతారన్నారు. నాలుగేళ్లగా ఎవరినీ పట్టించుకోని భరత్ ఇప్పుడు కేవలం ఓట్ల కోసం చీరలు పంచుతున్నాడన్నారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కాశి నవీన్ కుమార్ మాట్లాడుతూ చంద్రబాబు సీఎం కావాలి.. ఆదిరెడ్డి వాసు గెలవాలి.. జగన్‌ను ఇంటికి పంపించాలన్నారు.ఉమ్మడి అభ్యర్థి ఆదిరెడ్డి శ్రీనివాస్ మాట్లాడుతూ రాజమహేంద్రవరం బిడ్డగా మీకు హామీ ఇస్తున్నా రాజమహేంద్రరంలో బ్లేడ్ బ్యాచ్‌లను నియంత్రిస్తా, నగరాన్ని పూర్తి స్థాయిలో అభివృద్ధి చేస్తానన్నారు. మీ ఆశీర్వాదంతో తనను గెలిపించాలన్నారు. సాంస్కృతిక రాజధాని రాజమహేంద్రవరానికి భరత్ రామ్ అపకీర్తిని తీసుకువచ్చాడన్నారు. ఈ సభలో టీడీపీ రాష్ట్ర శెట్టిబలిజి సాధికార సమితి రాష్ట్ర కన్వీనర్ కుడుపూడి సత్తిబాబు, టీఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వర్రే శ్రీనివాసరావు,టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వాసిరెడ్డి రాంబాబు, టీడీపీ నగర ఉపాధ్యక్షుడు ఉప్పులూరి జానకిరామయ్య, మజ్జి రాంబాబు, దాస్యం ప్రసాద్, బుడ్డిగ రాధా, కొయ్యల రమణ, మరుకుర్తి రవియాద్, చాపల చిన్నరాజు, బట్లంకి ప్రకాష్, తురకల నిర్మల, మాలే విజయలక్ష్మి, కోసూరి చండీప్రియ, కప్పల వెలుగుకుమారి,జనసేన నాయకులు గంటా స్వరూప, ప్రియా సౌజన్య పాల్గొన్నారు.



ఎన్నికల శంఖారావం సభకు భారీగా హాజరైన పట్టణ ప్రజలు


రథంపై విహరిస్తున్న స్వామి,అమ్మవార్లు

సత్యదేవుడికి వేడుకగా రథోత్సవం

అన్నవరం, మార్చి 10: రత్నగిరివాసుడైన సత్యదేవుడికి ప్రతి ఆదివారం ఆర్జితసేవగా తీసుకొచ్చిన రథోత్సవం భక్తుల గోవిందనామ స్మరణల నడుమ వేడుకగా జరిగింది. ఉదయం 10గంటలకు ఆలయ పీఆర్వో కృష్ణారావు టెంకాయి కొట్టి రథోత్సవం ప్రారంభించారు. మంగళవాయిద్యాలు, భక్తుల గోవిందనామస్మరణల నడుమ వేడుకగా ముమ్మారు స్వామి,అమ్మవార్లు రథంపై ఆసీనులై తూర్పురాజగోపురం చుట్టూ ప్రదక్షిణ చేశారు.

వనదుర్గ ఆలయంలో ప్రత్యంగిర హోమం


హోమ పూర్ణాహుతి గావిస్తున్న పండితులు

రత్నగిరి క్షేత్రరక్షకిగా పూజలందుకుంటున్న వనదుర్గ ఆలయంలో ఆదివారం అమావాస్య సందర్భంగా ప్రత్యంగిర హోమం నిర్వహించారు. ఉదయం 9గంటలకు పండితుల గణపతిపూజ, పుణ్యాహవచనం అనంతరం అమ్మవారికి పారాయణలు, జపములు, నిర్వహించారు. 11గంటలకు పవిత్ర హోమగుండంలో సుగంధ ద్రవ్యాలను అర్పించి పూర్ణాహుతి గావించారు.

నిత్యాన్నదాన పథకానికి విరాళం అందజేత



అన్నవరం దేవస్థానంలో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న సత్యదేవా నిత్యాన్నదాన పథకానికి ఆదివారం ఇద్దరు దాతల నుంచి రూ.2లక్షలు విరాళాలుగా సమకూరాయి. అంగనంపూడికి చెందిన ఉప్పలపాటి నరేంద్రనాథ్ రూ.1,11,116, తునికి చెందిన పులవర్తి వెంకట జగన్నాథ గుప్తా రూ.1,00,100ను దేవస్థానం పీఆర్వో కృష్ణారావుకు అందజేశారు. ఈసందర్భంగా దాతను అభినందించి వారికి స్వామివారి ప్రసాదం, ప్రత్యేకదర్శన సౌకర్యం కల్పించారు. కార్యక్రమంలో ట్రస్టీ దోమాడ సుందరరావు తదితరులున్నారు.

వైభవంగా కుక్కుటేశునికి త్రిశూలస్నానం


కుక్కుటేశ్వరస్వామికి త్రిశూలస్నానం చేయిస్తున్న అర్చకులు

పిఠాపురం, మార్చి 10: కాకినాడజిల్లా పిఠాపురంలోని పాదగయ క్షేత్రంలో ఉన్న రాజరాజేశ్వరీ సమేత ఉమా కుక్కుటేశ్వరసామి కల్యాణోత్సవాల్లో భాగంగా ఆదివారం స్వామి, అమ్మవార్లకు త్రిశూల స్నానం నిర్వహించారు. కైతేపల్లి కుటుంబసభ్యులు ఉత్సవమూర్తులకు పూజలు జరిపి త్రిశూలస్నానం జరిపించారు. పూజలు నిర్వహించిన ఆలయ అర్చకులు పాదగయ పుష్కరిణిలో పుణ్యస్నానాలు ఆచరించారు. అంతకుముందు స్వామికి అభిషేకం, అమ్మవా రికి కుంకుమార్చన జరిగాయి.రాత్రి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమాల్లో ఆలయ కార్యనిర్వహణాధికారి పులి నారాయణమూర్తి, ఉత్సవకమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నేటితో ముగియనున్న కల్యాణోత్సవాలు

పిఠాపురం పట్టణంలోని పాదగయ క్షేత్రంలో వెలసి ఉన్న రాజరాజేశ్వరీ సమేత ఉమాకుక్కుటేశ్వరస్వామి కళ్యాణోత్సవాలు సోమవారం రాత్రితో ముగియనున్నాయి. చివరిరోజు తెప్పోత్సవం, శ్రీపుష్పయాగం నిర్వహించనున్నారు. ఉదయం 6గంటలు నుంచి స్వామికి అభిషేకం, అమ్మవారికి కుంకుమార్చన, పుష్పార్చన, రాత్రి 7గంటలు నుంచి పాదగయ పుష్కరిణిలో హంసవాహనంపై స్వామి, అమ్మవార్ల తెప్పోత్సవం నిర్వహిస్తారు. అనంతరం శ్రీపుష్పోత్సవం, ఏకాంతా సేవాగానం, స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక అలంకారం చేస్తారు. అనంతరం భక్తులకు దంపత తాంబూలాలు అందజేశారు. తెప్పోత్సవం, శ్రీపుష్పయాగానికి భక్తులు తరలివచ్చే అవకాశమున్నందున అందు కు తగ్గట్టుగా ఏర్పాట్లు చేస్తున్నామని ఈవో నారాయణమూర్తి తెలిపారు.

ఘనంగా త్రిశూల స్నాన పూజలు


దేవతామూర్తులను పల్లకీలో తీసుకెళుతున్న ఈవో, పండితులు

సామర్లకోట, మార్చి 10: కాకినాడజిల్లా సామర్లకోట కుమార రామ భీమేశ్వరాలయంలో మహాశివరాత్రి ఉత్సవ పూజలు పురష్క రించుకుని ఐదోరోజు ఆదివారం ఉదయం స్వామి,అమ్మవారికి త్రిశూలస్నాన పూజలు, తీర్థపు సేవ పూజలు ఘనంగా నిర్వహి ంచారు. ఆలయ కార్యనిర్వహనాధికారి బళ్ళ నీలకంఠం ఆధ్వర్యంలో ఆలయ ఈవో నీలకంఠం స్వయంగా పల్లకీని మోస్తూ కోనేరు పుష్కరిణి వద్దకు తోడ్కొని వచ్చారు. పండితులు సోమేశ్వరశర్మ, చెరుకూరి రాంబాబు, సన్నిధిరాజు వెంకన్నబాబు, భీమేశ్వరశర్మ తదితరులచే వేదమంత్రోచ్ఛారణల మధ్య త్రిశూల స్నాన పూజలు నిర్వహించారు. సోమవారంరాత్రి స్వామివారికి, అమ్మవారికి శ్రీ పుష్పయాగోత్సవం ఘనంగా నిర్వహించనున్నట్లు ఈవో నీలకంఠం తెలిపారు.

ఘనంగా రథోత్సవం

మహాశివరాత్రి ఉత్సవాలలో భాగంగా స్వామివారు, అమ్మవార్ల ఉత్సవమూర్తులతో శనివారం సాయంత్రం ప్రారంభించిన రథోత్సవం ఆదివారం తెల్లవారుజామున 2 గంటలకు దేవీచౌక్ వద్ద రథం షెడ్ సెంటర్‌కు చేరుకుంది. వివిధ సంస్కృతిక ప్రదర్శనలు, బాణసంచా కాల్పుల మధ్య రథోత్సవ ఉత్సవమూర్తులను తిరిగి పల్లకీలో ప్రతి ష్ఠించి ఆలయానికి తోడ్కొనే సమయంలో బాణాసంచా కాల్చారు.

సాహిత్యం అనంతమైనది..

- సినీ గేయ రచయిత భువన చంద్ర
- ముగిసిన అఖిలభారత తెలుగు సాహితీ సదస్సు

పోర్టుసిటీ (కాకినాడ), మార్చి 10 : సాహిత్యం అనంతమైదని ప్రముఖ సినీ గేయ రచయిత భువన చంద్ర అన్నారు. అఖిల భారత తెలుగుసాహితీ సదస్సు రెండోరోజు ఆదివారం ముగిసింది. ఈ సందర్భంగా వంగూరి ఫౌండేషన్, తూర్పుగోదావరి జిల్లా రచయితల సంఘం ఆధ్వర్యంలో కాకినాడలోని దంటు కళాక్షేత్రంలో నిర్వహించిన ఈ సదస్సుకు పెద్దఎత్తున తెలుగు భాషాభిమానులు హాజరయ్యారు. సదస్సుకు అధ్యక్షత వహించిన ఫౌండేషన్ అధ్యక్షుడు వంగూరి చిట్టెన్‌రాజు ఈ సందర్భంగా భువనచంద్రకు జీవన సాఫల్య పురస్కారం ప్రదానం చేశారు. అనంతరం భువన చంద్ర మాట్లాడుతూ పిల్లలకు తల్లిదండ్రులు మాతృభాష పట్ల అవగాహన కల్పించాలని పిలుపునిచ్చారు. ఎన్ని తరాలైనా తరగని ఆస్తి భాష ఒకటేనని అన్నారు. అనంత రం హాస్యరచనపై మాట్లాడారు. ఈ సందర్భంగా కౌముదీ, గలీవర్ సాహసయాత్రలు పుస్తకావిష్కరణలు జరిగాయి. హైదరాబాద్‌కు చెందిన డాక్టర్ వడ్డేపల్లి కృష్ణ తెలుగుపాట ప్రభావం-ప్రాభవం అంశంపై ప్రసంగించారు. కృష్ణాజిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు డాక్టర్ జీవి పూర్ణచంద్ మన తెలుగు మరుగులు అంశంపై ప్రసంగించారు. లోలమాలం, అంక పుంకాలు, ఈతబంటి, కమకలి, ఉలిపాలు తదితర అచ్చు తెలుగు పదాల అర్థాలను సోదాహరణంగా సమగ్రంగా వివరించారు. అనంతరం హైదరాబాద్‌కు చెందిన యనమండ్ర శ్రీరామకృష్ణ-లలిత దంపతులను సత్కరించారు. కవి రాజ హంస లు అంశంపై డాక్టర్ ఓలేటి పార్వతీశం, తెలుగు పద్యం చమత్కారం గురించి ప్రసంగించారు. గజేంద్ర మోక్షం, వ్యక్తిత్వ వికాసం అంశంపై డాక్టర్ గంగిశెట్టి లక్ష్మీనారాయణ, నిలువెత్తు నిత్యజీవన ప్రతిబింబం పుస్తక పరిచయ కార్యక్రమంలో యల మర్తి అనురాధ మాట్లాడారు. మధురానగర్ ప్రజా విద్యాలయం విద్యార్థులు ఇంగ్లీషు-తెలుగు అక్షరాల అనువాద కార్యక్రమంలో పాల్గొన్నారు. 25 మంది కవులు, కవయిత్రలతో కవి సమ్మేళనం జరిగింది. కాలగమనంతో కథావస్తువు అంశంపై జయంతి ప్రకాష్‌శర్మ, ప్రముఖ కవి విశ్వనాథ సత్యనారాయణ రచించిన మ్రెయి తుమ్మెద పుస్తకం గురించి, సుబ్బని లక్ష్మీనారాయణ మాట్లాడారు. అదేవిధంగా నిజజీవితం నుంచి హాస్య రచనలపై డాక్టర్ కొచ్చర్లకోట జగదీష్, వేమన పద్యాలు-చందస్సు అలంకా రాలపై బేతవోలు రామబ్రహ్మం ప్రసంగించారు. అనంతరం కవిత్వంలో విజేతలైన ఆర్‌వీవీ రాజా, పొత్తూరి సీతారామరాజు, పి.నాగజ్యోతికి, రచనలో విజేతలైన గేదెల సింహాచలం, ఎంఆర్‌వీ సత్యనారాయణ, యలమర్తి అనురాధలకు వరుసగా ప్రథమ ద్వితీయ, తృతీయ బహుమతులను అందజేశారు. ఈ కార్యక్ర మంలో దంటు కళాక్షేత్రం అధ్యక్షుడు దంటు భాస్కరరావు, సదస్సు నిర్వహణ కమిటీ సభ్యులు మార్ని జానకిరామ్‌చౌదరి, కె.గౌరీనాయుడు, మంగిపూడి రాధిక, జ్యోస్యుల కృష్ణబాబు, బాలాంత్రపు సుచిత్ర, డాక్టర్ కాళ్లకూరి శైలజ పాల్గొన్నారు.


కౌముదీ పుస్తకావిష్కరణ, పాల్గొన్న సాహితీ వేత్తలు


భువన చంద్రకు జీవన సాఫల్య పురస్కారం అందజేస్తున్న దృశ్యం

14న వైసీపీలోకి ముద్రగడ

- సీఎం జగన్ సమక్షంలో విజయవాడలో చేరికకు తేదీ ఖరారు
- సీటు ఆశించలేదు.. కేవలం వైసీపీకి ప్రచారం
- వైసీపీ అధికారంలోకి వచ్చాక ఏ పదవి ఇచ్చినా సరే..!


మాట్లాడుతున్న ముద్రగడ

కిర్లంపూడి, మార్చి 10: కాపు ఉద్యమనేత, మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభం, ఆయన కుమారుడు గిరిబాబు వైసీపీలో చేరేందుకు నిర్ణయం తీసుకున్నారు. ఆదివారం కాకినాడజిల్లా కిర్లంపూడిలో తన నివాసంలో ముద్రగడ విలేకరుల సమావేశం నిర్వహించారు. ముద్రగడ మాట్లాడుతూ ఈనెల 14వతేదీన విజయవాడలో ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి సమక్షంలో వైసీపీలో చేరేందుకు వెళ్తున్నానన్నారు. వైసీపీ నాయకులు ఎంపీ మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యేలు ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డి, కన్నబాబు, ఎంపీ వంగా గీత ఇతర నాయకులు ద్వారా వచ్చిన పిలుపుమేరకు వారికి మద్దతుగా పార్టీలో చేరడంపై నిర్ణయం తీసుకున్నానన్నారు. మరిన్ని పథకాలు పేదలకు చేరేలా కృషిచేయడానికి పార్టీలో చేరుతున్నానన్నారు. ఎమ్మెల్యే, ఎంపీ సీటు అడగకుండా, ఏదీ ఆశించకుండా పార్టీకి సర్వీసు చేయడం కోసమే పార్టీలో చేరుతున్నట్లు వివరించారు. భగవంతుడి దయ వల్ల వైసీపీ మళ్లీ అధికారంలోకి రావాలని వచ్చాక అధినాయకులు ఏ పదవి ఇచ్చినా తీసుకోవడానికి సుముఖంగా ఉన్నానన్నారు. అంతేకానీ ఇప్పుడున్న పరిస్థితుల్లో తనకు కానీ, తన కుమారుడికి కానీ సీటు అడిగే ఉద్దేశం పెట్టుకోలేదన్నారు. ప్రత్యక్ష రాజకీయంలో ఉన్నాననుకుని ముఖ్యమంత్రి జగన్ తరుపున ప్రచారం చేస్తానని ముద్రగడ తెలిపారు. వైసీపీ అధికారంలోకి రావడానికి పార్టీకి సేవ చేస్తానని తన వంతు శాయశక్తులా కృషిచేస్తానని అధినాయకులకు చెప్పానన్నారు.

మంత్రి సభకు జనాలు అరకొరే

- కుర్చీలను మడత పెట్టేసిన పంచాయతీ సిబ్బంది
- హుకుంపేటలో 'చేయూత' పంపిణీ సభ

రాజమహేంద్రవరంరూరల్, మార్చి10: ప్రభుత్వంపై నమ్మకం సన్నగిల్లిందో లేక తీవ్ర వ్యతిరేకతో తెలియదుగాని మంచినీళ్ల, స్నాక్స్, బస్సులు వంటివి ఏర్పాటు చేసినా కార్యక్రమాలకు ప్రజలు హాజరుకావడం లేదు. మొదటి మీటింగ్‌కు ఫుల్‌గా వచ్చారు, రెండోసారి మీటింగ్‌కు తగ్గారు.. ఆదివారం రాజమహేంద్రవరం రూరల్ మండలం హుకుంపేట పరిధిలోని నేషనల్ హైవే ఆనుకొని డీమార్టు పక్కనున్న ఖాళీ స్థలంలో ప్రభుత్వ పథకాల పంపిణీ కార్యక్రమం ఏర్పాటుచేశారు. మంత్రి వేణుగోపాలకృష్ణ నియోజకవర్గ వైసీపీ కోఆర్డినేటర్‌గా వచ్చినప్పటి నుంచి పింఛన్ల పంపిణీ, డ్వాక్రా మహిళల సున్నావడ్డీ, ఆదివారం చేయూత పంపిణీ కార్యక్రమాలు చేపట్టారు. చేయూత పంపిణీ కార్యక్రమానికి ఆరు వేలు జనసమీకరణ చేయాలని, వాటికి అనుగుణంగా ఏర్పాట్లు చేయాలంటూ అధికారులకు మౌఖిక ఆదేశాలు జారీ చేసినట్టు తెలిసింది. అయితే వారు అనుకున్న దానికంటే సగం మంది కూడా హాజరు కాకపోవడంతో మంత్రి అవాక్కయ్యారు. దీంతో ఖాళీగా వున్న కుర్చీలను మడత పెట్టాలంటూ చెప్పడంతో పంచాయతీ కార్మికులతో కుర్చీలను ఎత్తివేయించారు. మరొక విషయం ఏమిటంటే ప్రతి సమావేశానికి బస్సులు పంపించే పాఠశాలల యాజమాన్యం కూడా బస్సులను పంపించలేమంటూ చేతులెత్తేస్తోందని కొంతమంది అధికారులు చెవులు కొరుక్కుంటున్నారు. ఈనెల 7న ముఖ్యమంత్రి చేయూత బటన్ నొక్కారు. ఆదివారం (మార్చి 10) రూరల్ మండలం పరిధిలో చేయూత చెక్కును పంపిణీ చేయడం ఏమిటంటూ కార్యక్రమాల నిర్వహణ పేరుతో పార్టీ ప్రచారాలు చేసుకుంటూ పంచాయతీ, మండల పరిషత్ నిధులను దుర్వినియోగం చేస్తున్నారంటూ పలు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.


కుర్చీలను ఎత్తివేస్తున్న పంచాయతీ సిబ్బంది

రేపు వందే భారత్ రెండో ఎక్స్‌ప్రెస్ రైలు ప్రారంభం

- సికింద్రాబాద్ నుంచి విశాఖల మధ్య రాకపోకలు

సామర్లకోట, మార్చి 10: విశాఖ నుంచి సికింద్రాబాద్‌కు రెండవ వందేభారత్ ఎక్స్‌ప్రెస్ రైలును ఈనెల 12న మంగళవారం ప్రధాని నరేంద్రమోదీ వర్చువల్ విధానంలో ప్రారంభించనున్నారు. ఈ రైలును ట్రయల్‌గా మంగళవారం సికింద్రాబాద్ నుంచి విశాఖకు ఒకవైపునకు మాత్రమే ట్రయల్ రన్ నిర్వహించనున్నారు. ఈమేరకు సామర్లకోట రైల్వేస్టేషన్‌కు ఆదివారంరాత్రి దక్షిణ మధ్య రైల్వే సీపీటీఎం అధికారి ఎం.ఏల్వేందర్‌యాదవ్ నుంచి ఉత్తర్వులు అందాయి. ఈ మేరకు ఆంధ్రజ్యోతి సేకరించిన సమాచారం ఇలాఉంది. ఇప్పటికే విశాఖ-సికింద్రాబాద్‌ల మధ్య ఒక వందేభారత్ ఎక్స్‌ప్రెస్ రైలు రాకపోకలు సాగిస్తున్న విషయం విధితమే. ఈ రెండు పట్టణాల మధ్య ప్రయాణికుల అవసరాలను రైల్వే గుర్తించి రెండవ వందేభారత్ ఎక్స్‌ప్రెస్ రైలును ప్రవేశపెట్టాలని నిర్ణయించినట్లు తెలిసింది. ప్రధాని నరేంద్ర మోదీ దేశవ్యాప్తంగా పలు రైల్వేస్టేషన్లలోని అభివృద్ధి పనులకు, నూతన రైళ్లకు ఈనెల 12న శ్రీకారం చుట్టనున్నందున మంగళవారం సికింద్రాబాద్-విశాఖల మధ్య ట్రయల్ రన్‌గా రెండవ వందేభారత్ ఎక్స్‌ప్రెస్ రైలు రానున్నది. అధికారికంగా రెగ్యులర్‌గా ఈనెల 13న విశాఖ నుంచి సికింద్రాబాద్‌కు రైలు నెం. 20708 గానూ, ఈనెల 15న సికింద్రాబాద్ నుంచి విశాఖకు రైలు నెం.20707 గానూ 8 కోచ్‌లతో ఈ రెండు నగరాల మధ్య రాకపోకలు సాగించనున్నాయి. ఈ రైళ్లు వరంగల్, ఖమ్మం, విజయవాడ, రాజమహేంద్రవరం, సామర్లకోటలలో ఆగనున్నాయి. గురువారం మినహా వారంలో మిగిలిన ఆరు రోజులలోనూ రాకపోకలు సాగించనున్నాయి. 20707 నంబరుగల వందే భారత్ రెండవ ఎక్స్‌ప్రెస్ రైలు సికింద్రాబాద్‌లో తెల్లవారుజామున 5.05 గంటలకు బయలుదేరి 6.39కి వరంగల్ చేరుతుంది. ఖమ్మం 7.43కి చేరి కొండపల్లి రూట్ మీదుగా విజయవాడకు 9.10కి చేరుతుంది. రాజమహేంద్రవరంనకు 11.02కి చేరుతుంది. 11.43కి సామర్లకోటకి చేరి దువ్వాడ మీదుగా విశాఖకు మధ్యాహ్నం 1.50కి చేరుతుంది. 20708 నంబరుగల వందేభారత్ రెండవ ఎక్స్‌ప్రెస్ రైలు విశాఖలో మధ్యాహ్నం 2.35కి బయలుదేరి దువ్వాడ మీదుగా సామర్లకోటకు సాయంత్రం 4.03 నిమిషాలకు చేరుతుంది. రాజమహేంద్రవరంనకు 4.38కి చేరి తిరిగి విజయవాడకు రాత్రి 6.40కి చేరుతుంది. కొండపల్లి మీదుగా ఖమ్మంనకు రాత్రి 10.03కి చేరుతుంది. వరంగల్‌కు రాత్రి 11.03కి చేరుతుంది. సికింద్రాబాద్‌కు రాత్రి 11.20కి చేరుతుంది. ఈనెల 12న లాంఛనంగా ట్రయల్ రన్ ప్రారంభించనున్న వందేభారత్ ఎక్స్‌ప్రెస్ రైలు చరాక పురష్కరించుకుని సామర్లకోట, రాజమహేంద్రవరం స్టేషన్లలో ప్రయా ణికులకు అవగాహన కల్పించేందుకు ప్రత్యేక కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని ఈ రెండు స్టేషన్ల రైల్వే అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. వన్‌స్టేషన్ వన్ సేల్ పేరిట స్టేషన్ ఆవరణలలో ఏర్పాటుచేసిన స్టాల్స్‌ను కూడా మంగళవారం ప్రారంభించేలా ఆదేశాలను జారీ చేశారు.


వందేభారత్ ఎక్స్‌ప్రెస్ రైలు

తోటలో కాలేజీ పుస్తకావిష్కరణ


మాట్లాడుతున్న డాక్టర్ పీవీ రమేష్

కాకినాడ రూరల్, మార్చి 10: కాకినాడ పీఆర్ ప్రభుత్వ అటానమస్ కళాశాలలోని పరిపాలనా విభాగంలోగల ఎల్‌సీడీ హాల్లో ఆదివారం సాయత్రం తోటలో కాలేజీ పుస్తకావిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రిన్సిపాల్ డాక్టర్ బీవీ తిరుపాణ్యం అధ్యక్షత వహించగా ముఖ్యఅతిథిగా ఏపీ ప్రభుత్వ విశ్రాంత అదనపు చీఫ్ సెక్రటరీ పీవీ రమేష్ పాల్గొని 358 పేజీల పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ పుస్తకాన్ని ముళ్లపూడి శ్రీనివాస ప్రసాద్ సంకలనంచేయగా డాక్టర్ ఎంవీ భరతలక్ష్మి, పైడా వెంకటేశ్వరరావు పాల్గొన్నారు. ఈసందర్భంగా పీవీ రమేష్ మాట్లాడుతూ ఈపుస్తకంలో పిఠాపురం రాజా, రఘుపతి వెంకయ్యనాయుడు కలిసి ఆరోజుల్లో పీఆర్ కళాశాలను, ఏవిదంగా అభివృద్ధి చేశారో రచయిత తెలపడం జరిగిందన్నారు. పలువురు అధ్యాపకులు, ప్రముఖులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పాపికొండలకు వెళ్లిన ఆరు బోట్లు


పాపికొండలకు వెళుతున్న పర్యాటక బోట్లు

దేవీపట్నం, మార్చి 10: ఆదివారం పాపికొండలకు ఆరుబోట్లలో సుమారు 450 మంది పర్యాటకులు వెళ్లారు. ముందుగా మాతృశ్రీ గండిపోశమ్మ అమ్మవారిని దర్శించుకుని గోదావరి నదీ పరీవాహక ప్రాంతాలు పూడిపల్లి, దేవీపట్నం, మంటూరు, కొండమొదలు గ్రామాలు మీదుగా పాపికొండలు చూసి వెనుదిరిగారు. పాపికొండలు అందాలు చూసి పర్యాటకులు మంత్రముగ్ధులయ్యారు.

ముగిసిన భావనారాయణస్వామి తిరునాళ్లు

- వైభవంగా సాగిన మాఘమాసోత్సవాలు



సర్పవరం జంక్షన్, మార్చి 10: కాకినాడ జిల్లాలోనే సర్పవరంలో శ్రీరాజ్యలక్ష్మి సమేత శ్రీభావనారాయణ స్వామి ఆలయంలో ఫిబ్రవరి 10 నుంచి మార్చి 10 వరకు నెలరోజులపాటు నిర్వహిస్తున్న మాఘమాస తిరునాళ్లు ఆదివారంతో ముగిశాయి. మాఘమాసోత్సవాల్లో భాగంగా అయిదో ఆదివారం శ్రీ భావనారాయణస్వామిని దర్శించుకునేందుకు ఉమ్మడిజిల్లా నలుమూలల నుంచి వేలాది మంది భక్తులు తరలివచ్చారు. ముందుగా భక్తులు భావనారాయణస్వామిని దర్శించుకున్న అనంతరం ఈశాన్యంలో గల లక్ష్మీదేవి, ఆగ్నేయంలో గల ఆదిశేషు శ్రీభావనారాయణ స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. స్వామివారికి ప్రీతిపాత్రమైన పాలపొంగులను ఆవుపిడకలతో పొయ్యిపై తయారుచేసి భక్తిశ్రద్ధలతో స్వామివారికి నైవేద్యంగా సమర్పించారు. మాఘమాసంలో శ్రీభావనారాయణస్వామిని దర్శించుకుంటే దేశంలో ఉన్న 108 వైష్ణవ దేవాలయాలను దర్శించుకున్న ఫలితం దక్కుందని భక్తులు తెలిపారు. ఆలయ కమిటీ, దాతల సహకారంతో భక్తులకు అన్నప్రసాదాన్ని పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ పుల్ల సుధాచందూ, ఉప సర్పంచ్ పుల్ల ప్రభాకరరావు, ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

హాకీ చాంపియన్ షిప్‌లో
ఉమ్మడి జిల్లా జట్టు ప్రతిభ

కాకినాడ అర్బన్, మార్చి 10: ప్రకాశం జిల్లా మైనంపాడులో జరిగిన రాష్ట్ర మహిళా హాకీ చాంపియన్‌షిప్‌ను ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా జట్టు కైవసం చేసుకుంది. ఫైనల్‌లో అనకాపల్లి జట్టుపై 2.0 స్కోరుతో గెలుపొందింది. జట్టు శిక్షకుడిగా వి.రవిరాజు, మేనేజర్‌గా జి.దుర్గాదేవి, కెప్టెన్‌గా డా.నందిని వ్యవహరించారని హాకీ సంఘం జిల్లా కార్యదర్శి నంబూరి శ్రీనివాసరావు తెలిపారు.


రాష్ట్ర హాకీ మహిళా చాంపియన్‌షిప్ సాధించిన జిల్లా జట్టు

తలపై తారాజువ్వ పడి బాలిక మృతి

వీరంపాలెం శివరాత్రి ఉత్సవాల్లో అపశ్రుతి


మృతి చెందిన పుష్ప

తాడేపల్లిగూడెంరూరల్, మార్చి 10 : పశ్చిమగోదావరిజిల్లా తాడేపల్లిగూడెం మండలం వీరంపాలెం మహా శివరాత్రి ఉత్సవాల ముగింపు సందర్భంగా శనివారం రాత్రి బాణసంచా కాలుస్తుండ గా తారాజువ్వ బాలిక తలపై పడి తీవ్ర రక్తస్రావం కావడంతో అక్కడికక్కడే మృతి చెందింది. దేవరపల్లి మండలం త్యాజంపూడికి చెందిన దాసరి పుష్ప (12) తన స్నేహితురాలితో కలిసి శివరాత్రి ఉత్సవాల ఊరేగింపు తిలకించేందుకు వచ్చింది. ఊరేగింపులో బాగంగా బాణసంచా కాలుస్తుండగా జువ్వ విఫలమై బాలిక తలపై పడింది. దీంతో పుష్ప తలకు తీవ్రగాయమై రక్తస్రావమైంది. అపస్మారక స్థితికిచేరి మృతిచెందింది. బాలిక మృతదేహాన్ని తాడేప ల్లిగూడెం ఏరియా ఆసుపత్రికి తరలించి పోస్టుమార్టం నిర్వహించినట్టు సీఐ రమేష్ తెలిపారు.

త్యాజంపూడిలో విషాదఛాయలు


దాసరి పుష్ప (ఫైల్)

దేవరపల్లి, మార్చి 10: దేవరపల్లి మండలం త్యాజంపూడి గ్రామానికి చెందిన దాసరి చిట్టి, లక్ష్మీ దంపతుల కుమార్తె పుష్ప(16) యర్న గూడెం జడ్పీహైస్కూల్‌లో 9వ తరగతి చదువుతోంది. శివరాత్రి సందర్భంగా సెలవులు రావడంతో తాడేపల్లిగూడెం మండలం వీరంపాలెం బంధువుల ఇంటికి వెళ్లింది. అక్కడ బాలత్రిపుర సుందరిపీఠం శివరాత్రి ఉత్సవాల్లో భాగంగా 2వరోజు శనివారంరాత్రి బాణసంచా కాలుస్తుండగా పుష్ప తలపై టపాస్ పేలడంతో బాలిక అక్కడికక్కడే మృతి చెందింది. త్యాజంపూడిలో ఆదివారం అంత్యక్రియలు నిర్వహించారు. దాసరి చిట్టి, లక్ష్మీలకు ముగ్గురు పిల్లలు. ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె. ఒక కుమారుడు వ్యవసాయ కూలీ పనిచేస్తుండగా రెండో కుమారుడు ఇంటర్ చదువుతున్నాడు. కుమార్తె పుష్ప యర్నగూడెం హాస్టల్‌లో ఉంటూ 9వ తర గతి చదువుతోంది. స్వగ్రామమైన త్యాజంపూడిలో సెలవులకు వెళ్లి బాబాయ్ కుమార్తెతో కలిసి వీరంపాలెం ఉత్సవాలు చూడడానికి వెళ్లింది. ఈ ప్రమాదంతో త్యాజంపూడిలో విషాదఛాయలు అలుముకున్నాయి. హైస్కూల్ హెచ్ ఎం.ఊబా చంద్రరావు, సర్పంచ్ కుసులూరి స్వరూపరాణి సంతాపం వ్యక్తంచేశారు.

మన్యం బంద్ ప్రశాంతం

చింతూరు, మార్చి 10 : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల తీరుని నిరసిస్తూ గిరజన సంఘం ఇచ్చిన పిలుపు మేరకు ఆదివారం బంద్ ప్రశాంతంగా, సంపూర్ణంగా జరిగింది. వ్యాపార సముదాయాలు, పెట్రో బంక్‌లు, హోటల్లు మూసివేసి గిరిజనుల డిమాండ్లకు మద్దతు ఇచ్చారు. బంద్‌లో భాగంగా గిరిజన సంఘాల నా యకులతో పాటు పలువురు గిరిజనులు, వివిధ పార్టీలకు చెందిన గిరిజన నాయకులు, గిరిజన ఉద్యోగ సంఘ నాయకులు ర్యాలీ, నిరసన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి పులి సంతోష్, సీపీఎం జిల్లా నాయకుడు నీసం సురేష్ మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం మెగా డీఎస్సీ అంటూ దగా డీఎస్సీని ప్రకటించి గిరిజనులపట్ల తన చిత్తశుద్ధిని ప్రక టించుకుందని ఆరోపించారు. జీవో నెం.3అమలుకు వైసీపీ ప్రభుత్వం ఎటువంటి చట్టబద్ధత తీసుకురాకుండా మిన్నకుండి పోయిందని, దీంతో చదువుకున్న ఆదివాసీ యువత తీవ్రంగా నష్టపోయిందన్నారు. ఐదవ షెడ్యూల్ ప్రాంతంలో ఆదివాసీలు సంపూర్ణ అభివృద్ధిని సాధించడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎటువంటి చర్యలు చేపట్టకపోవడం విడ్డూరమన్నారు. ఆదివాసీ ప్రాంతంలో నూటికి నూరుశాతం ఉద్యోగ అవకాశాలు గిరిజనులకే కేటాయించాలని వారు డిమాండ్ చేశారు. అప్పటివరకు గిరిజనులు ఐక్య ఉద్యమాలకు నడుం బిగించాల్సి ఉందన్నారు. ఉద్యమాలతోనే హక్కులు సాధించుకునే అవకాశం ఉందన్నారు. గిరిజన నాయకులు దిలీప్, శీలం తమ్మయ్య, పాండ్రు నాగార్జున, మొట్టుం రాజయ్య, కారం సుబ్బారావు, తీగలరవి, భీమయ్య పాల్గొన్నారు.

రంపచోడవరంలో బంద్

రంపచోడవరం మార్చి 10: రంపచోడవరంలో మన్యం బంద్ ఆదివారం ప్రశాంతంగా జరిగింది. ఆదివారం ఉదయం సీపీఎం, సీఐటీయూ గిరిజన సంఘం నాయకులు ప్రధాన రహదారిపై నిరసన తెలిపారు. జీవో నెం.3, స్పెషల్ డీఎస్సీ, పోలవరం నిర్వాసితులకు నష్టపరిహారం ఇవ్వాలని తదితర డిమాండ్లతో రాష్ట్ర వ్యాప్తంగా ఏజెన్సీ జిల్లాలో ఆదివారం బంద్ నిర్వహించగా రంపచోడవరంలో చేసిన బంద్‌లో సీపీఎం జిల్లా కార్యదర్శి బొప్పన కిరణ్, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు మట్ల వాణిశ్రీ , సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు (గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు) లోతా రామారావు తదితర నాయకులు ఉన్నారు.


చింతూరులో బంద్ సందర్భంగా ర్యాలీ నిర్వహిస్తున్న గిరిజనులు


కూనవరంలో రోడ్డుపై వాహనాలు ఆపి నిరసన తెలుపుతున్న గిరిజన సంఘం నాయకులు

ఆంధ్రజ్యోతి www.andhrajyothy.com

తూర్పుగోదావరి

ఏజెన్సీ సమాచారం

మన్యం బంద్ విజయవంతం

కూనవరం: తమ హక్కుల సాధన కోసం గిరిజన సంఘం నాయకులు నిర్వహించిన మన్యం బంద్ విజయవంతమైంది. తెల్లవారుజాము నుంచే బంద్ విజయవంతం చేయాలని కోరుతూ గిరిజన సంఘం నాయకులు రోడ్డెక్కారు. రోడ్లపై వాహనాల రాకపోకలు నిలిపివేశారు. ఏజెన్సీలో స్పెషల్ డీఎస్సీ నిర్వహించాలని జీవో నెం.3ను పునరుద్ధరించాలని దానికోసం ప్రభుత్వాలు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. అటవీహక్కుల చట్టాలు పటిష్టంగా అమలుచేయాలని, భాషా ప్రాతిపదికన వలంటీర్లను రెగ్యులర్ చేయాలని, పోలవరం నిర్వాసితులకు పూర్తిస్థాయిలో నష్టపరిహారం చెల్లించాలని కోరుతూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి పాయం సీతారామయ్య, కొమరం పెంటయ్య, మేకల నాగేశ్వరరావు, తాళ్లూరు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

వరరామచంద్రాపురం: మండలంలో ఆదివాసి గిరిజన సంఘం ఆధ్వర్యంలో జరిగిన మన్యం బంద్ ప్రశాంతంగా జరిగింది. మండలంలోని రేఖపల్లి, వీఆర్ పురం, తదితర గ్రామాలలో వ్యాపారస్తులు, వాహనదారులు స్వచ్ఛందంగా దుకాణాలను మూసివేశారు. వాహనదారులు మన్యం బంద్‌కు మద్దతు తెలిపారు. కార్యక్రమంలో గిరిజన సంఘం మండల కార్యదర్శి పూనెం ప్రదీప్‌కుమార్, సోయం చినబాబు, ఆదివాసీ నాయకులు పాయం లక్ష్మన్, సవలం రాజేంద్ర ప్రసాద్, పి.రామారావు, సీపీఎం నాయకులు పంకు సత్తిబాబు, కుంజా నాగిరెడ్డి, సుబ్బారావు, తుర్రం బాబూరావు, వెట్టి లక్ష్మి, వడ్లాది రమేష ప్రకాష్ పాల్గొన్నారు.

సీపీఎం బలోపేతంతోనే ముత్యంకు ఘనమైన నివాళి


సీపీఎం నాయకుడు పత్రా ముత్యం స్మారక స్థూపం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

చింతూరు, మార్చి 10: సీపీఎం పార్టీని గ్రామ గ్రామాన బలోపేతం చేసినప్పుడే పత్రాముత్యంకు ఘనమైన నివాళి అని సీపీఎం జిల్లా నాయకుడు సీసం సురేష్ పేర్కొన్నారు. ఆదివారం తుమ్మలలో పత్రాముత్యం పదో వర్ధంతి కార్యక్రమ నిర్వహించారు. ఈ సందర్భంగా ముత్యం చిత్రప టానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. చింతూరు మండలంలో సీపీఎం పార్టీ నిర్మాణంలో ముత్యం పాత్ర కీలకమైనదన్నారు. మరోవైపు గిరిజన సంప్రదాయ డోలు కొమ్ము నృత్యంతో ముత్యం మన్యంలోని చింతూరును దేశవ్యాప్త గుర్తింపు తీసుకువచ్చారన్నారు. అటువంటి నాయకుడిని మావోయిస్టులు హత్యచేసి ఏం సాధించారని ఆయ న ప్రశ్నించారు. ప్రజల కష్టాలను తన గొంతుతో అధికా రుల దృష్టికి తీసుకెళ్లడంతో ఎన్నో సమస్యలను ముత్యం పరిష్కరించారన్నారు. ముత్యం పోరాట స్ఫూర్తితో ప్రతి కార్యకర్త ప్రజా సమస్యలపై ఉద్యమించాలన్నారు. కార్యక్ర మంలో సీపీఎం నాయకులు పల్లపు వెంకట్, మొట్టుం రాజయ్య, సోడె లెనిన్, పత్రా ముత్యం కుటుంబ సభ్యులు పత్రా రమేష్ పాల్గొన్నారు.

పోలవరం నిర్వాసితుల కోసం ప్రత్యేక కోర్టు నెలకొల్పాలి

దేవీపట్నం, మార్చి 10: పోలవరం నిర్వాసితుల సమస్యల పరిష్కారం కోసం రంపచోడవరంలో ప్రత్యేక కోర్టు నెలకొల్పాలని భారత్ ఆదివాసీ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తెల్లం శేఖర్ డిమాండ్ చేశారు. పెద్దభీంపల్లి ఆర్‌అండ్‌ఆర్‌కాలనీలో ఆదివారం జేఏసీ నాయకులు యలగాడ నాగేశ్వరరావు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. భూమికి, చెట్లకు, డి పట్టా భూములకు నష్టపరిహారం తదితర వాటికి ప్రభుత్వం మూడు రెట్లు నష్టపరిహారం చెల్లించడానికి ప్రభుత్వం సిద్ధం కావాలన్నారు. నిర్వాసితుల సమస్యల కోసం రాజమహేంద్రవరం వెళ్లి రావల్సి వస్తుందని తమకు ప్రత్యేకంగా రంపచోడవరంలోనే ప్రత్యేక కోర్టు ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ అధ్యక్షుడు కారం రామన్నదొర, సతీష్, కె.శ్రీనువాసురెడ్డి, ముచ్చిక వెంకటేశ్వర్లు, కె.సాయిరెడ్డి, కె.గాంధీరెడ్డి పాల్గొన్నారు.

ఏకలవ్య పాఠశాలలో సావిత్రీభాయి పూలే వర్ధంతి

వై.రామవరం, మార్చి10: మండలంలోని పి.యర్రగొండ గిరిజన సంక్షేమ ఏకలవ్య పాఠశాలలో ఆదివారం సావిత్రిభాయిపూలే వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ శ్రీపాదరామకృష్ణ ఆధ్వర్యం లో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు సావిత్రిభాయి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సమాజానికి సావిత్రిభాయి అందించిన సేవలు ఆదర్శనీయమని కొనియాడారు.

బాబు ష్యూరిటీ భవిష్యత్ గ్యారెంటీ



మోతుగూడెం, మార్చి10: చింతూరు మండలం గూడూరు పంచాయతీ తూలుగొండలో టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు ప్రవేశ పెట్టిన బాబు ష్యూరిటీ భవిష్యత్ గ్యారెంటీ శంఖారావం కార్యక్రమం సూపర్ సిక్స్ పథకాలు ఇంటింటా తిరుగుతూ ప్రజల్లోకి నాయకులు తీసుకెళ్లారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి యూనిట్ ఇన్‌చార్జ్ మల్లెల వెంకటేష్, క్లస్టర్ ఇన్‌చార్జ్ ఓబిల్లనేని నరసింహారావు, తూలుగొండ నాయకులు పాల్గొన్నారు.

వివేకా హత్య కేసులో జగన్ పాత్రపై విచారణ జరపాలి

● మాజీ ఎమ్మెల్యే వంతల

రంపచోడవరం మార్చి 10: వివేకానందరెడ్డి హత్య కేసులో ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి పాత్రపై విచారణ జరపాలని మాజీ ఎమ్మెల్యే టీడీపీ నియోజకవర్గ ఇంచార్జ్ వంతల రాజేశ్వరి అన్నారు. ఆమె ఆదివారం మీడియాతో మాట్లాడుతూ రాజకీయ లబ్ధి కోసమే వైఎస్ వివేకానందరెడ్డిని జగన్ ముఠానే హతమార్చిందని, గొడ్డలిపోటుతోనే బాబాయి చనిపోయాడని జగన్ అంత ఖచ్చితంగా ఎలా చెప్పగలుగుతారని వంతల రాజేశ్వరి ప్రశ్నించారు. వివేకానందరెడ్డిని క్రూరంగా చంపిని హంతకులకు శిక్ష పడకపోతే రేపు పౌరుల మానప్రాణాలకు కూడా రక్షణ ఉండదని, సామాన్యుల మానప్రాణాలకు రక్షణ ఉండాలంటే సునీతమ్మ చెప్పినట్లుగా జగన్మోహన్‌రెడ్డిని ఓడించాలని వంతల అన్నారు.

ఆదివాసీ హక్కుల పట్ల ప్రభుత్వాలకు చిత్తశుద్ధిలేదు

● ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుంజా శ్రీను

ఎటపాక, మార్చి 10: ఆదివాసీల చట్టాలు, హక్కుల పట్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు చిత్తశుద్ధి లేదని, ఆదివాసీల హక్కులను కాలరాసే ప్రభుత్వాల పతనం తప్పదని ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుంజా శ్రీను పేర్కొన్నారు. శ్రీకాకుళం జిల్లాలో ఏపీస్పీ ఆధ్వర్యంలో కొనసాగుతున్న ఆమరణ నిరాహార దీక్షకు సంఘీభావంగా ఆదివారం పట్టుచీర గ్రామంలో నిరసన తెలిపారు. ఈసందర్భంగా శ్రీను మాట్లాడారు. ఆదివాసీల రిజర్వేషన్లను ఆర్థికంగా, సామాజికంగా అభివృద్ధి చెందిన కులాలను ఎస్టీ జాబితాలో చేర్చే కుట్ర జరుగుతుందని విమర్శించారు. మైదాన ప్రాంత బీసీ కులాల్లోని నకిలీ గిరిజనేతర బోయవాల్మీకీలను ఎస్టీలో కలపాలని చర్యలు తీసుకోవడం సరికాదన్నారు. ఈకార్యక్రమంలో తెల్లం సత్యనారాయణ , పాయం భద్రయ్య ,సోడు కిట్టయ్య పాల్గొన్నారు.

గండిపోశమ్మ తల్లి దర్శనాలు పునఃప్రారంభం

దేవిపట్నం, మార్చి 10: మాతృశ్రీ గండిపోశమ్మ తల్లి అమ్మవారి దర్శనాలు ఆదివారం నుంచి పునఃప్రారంభమయ్యాయి. పోలవరం ప్రాజెక్టు నిర్మాణంవల్ల బ్యాక్ వాటర్‌లో సుమారు ఎనిమిది నెలలపాటు పూర్తిగా నీటమునిగిన అమ్మవారి ఆలయం భక్తుల దర్శనానికి పూర్తిగా దూరమైంది. ఆలయంవద్ద ఇటీవల బ్యాక్ వాటర్ తగ్గడంతో సంప్రోక్షణతో తిరిగి ఆలయాన్ని ప్రారంభించినట్లు కార్యనిర్వహణాధికారి తెలిపారు. విషయం తెలిసిన చుట్టుపక్కల గ్రామస్థులు, భక్తులు విచ్చేసి గోదావరిలో పుణ్యస్నానాలాచరించి అమ్మవారికి దూపదీప నైవేద్యాలు సమర్పించి గజమాలలువేసి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయంవద్ద భక్తులకు ఎటువంటి అసౌ కర్యం కలుగకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని భక్తులు కోరారు.

పోలవరంతో ఆదివాసీలకు అన్యాయం

● ఆదివాసీ సంక్షేమ పరిషత్ జాతీయ అధ్యక్షుడు నాగేశ్వరరావు

ఎటపాక, మార్చి10: పోలవరం ప్రాజెక్టుతో ఏజెన్సీలోని ఆదివాసీలకు తీవ్ర అన్యాయం జరుగుతుందని, ఆదివాసీ సంక్షేమ పరిషత్ జాతీయ అధ్యక్షుడు దాట్ల నాగేశ్వరరావు అన్నారు. ఆదివారం దమ్మక్కగూడెం ఆదివాసీ సంక్షేమ పరిషత్ కార్యాలయంలో రెండు తెలుగు రాష్ట్రాల సమస్యలపై చర్చించారు. 5వ షెడ్యూల్ ఏరియాలో రాజ్యాంగం కల్పించిన 1బై70 యాక్టు అమలు కావడంలేదన్నారు. లక్ష్మీదేవిపేటలో ఆదివాసీల ఇళ్లను కాల్చిన వారిపై అట్రాసిటీ కేసులు నమోదు చేయాలని అన్నారు. కార్యక్రమంలో ఆదివాసీ సంక్షే రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బంగారు వెంకటేష్ పాల్గొన్నారు.

కోట సత్తెమ్మకు విశేష పూజలు

నిడదవోలు, మార్చి 10: మండ లంలోని తిమ్మరాజుపాలెంలో కోట సత్తెమ్మ ఆలయంలో ఆదివారం విశేష పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి ధూపహారతి, నిత్యార్చనా, లలితా పారాయణం, సహస్రనామ కుంకుమ పూజలు జరిపారు. అనంతరం క్షీర, మహానివేదన చేశారు. పలు ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో ఆలయం కిటకిటలాడింది. ప్రత్యేక అలంకరణలో ఉన్న అమ్మవారిని భక్తులు పెద్ద ఎత్తున దర్శించుకున్నారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా అమ్మవారి దర్శనం కలుగజేశారు.

ఎంపీ భరత్ ఇన్‌చార్జిలను తొక్కేసి పనిచేయమన్నారా?

▸ వైసీపీ వార్డు ఇన్‌చార్జి ఆవేదన
▸ తనకు తెలియకుండానే జాయినింగ్స్‌పై మండిపాటు
▸ ఫోన్‌లో ఇద్దరి సిటీ నేతల మధ్య వాగ్వాదం

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

ఎన్నికల వేళ వైసీపీ అరాచకాలు.. ఆధిపత్యపోరు వంటి బాగోతాలు ఒక్కొక్కటిగా బయటపడుతున్నాయి. రౌడీషీటర్ల వైఖరి.. వడ్డీకి డబ్బులు ఇచ్చి పిల్లలను చితకబాదడం వంటి సంఘటనలు బయటకు వస్తున్నాయి. ఇప్పటికే బ్లేడ్‌బ్యాచ్, అరాచకవాదులు పెరిగిపోయారనే ప్రజలు ఆందోళన చెందుతున్న సంగతి తెలిసిందే. తాజాగా వెలుగులోకి వచ్చిన ఓ ఆడియో వైసీపీ చిన్న స్థాయి నేతల వైఖరిని, వారి మధ్య ఉన్న ఆధిపత్య పోరును తెలియజేస్తోంది. వైసీపీ సిటీ యూత్ ప్రెసిడెంట్ పీతా రామకృష్ణ, ఆర్యాపురం సత్యనారాయణ స్వామి దేవస్థానం చైర్‌పర్సన్, 40వ వార్డు వైసీపీ ఇన్‌చార్జి దుంగా మంగాదేవి మధ్య ఇటీవల జరిగిన ఫోన్ సంభాషణ వారి వైఖరిని స్పష్టం చేస్తోంది. తన వార్డులో తనకు తెలియకుండా పార్టీలోకి జాయినింగ్‌లు పెట్టినందుకు మంగాదేవి ఫోన్ చేసి పీతా రామకృష్ణను ప్రశ్నించింది. దీంతో వారిద్దరి మధ్య మాటా మాటా పెరిగింది.. నువ్వెంత అంటే నువ్వెంత అనే స్థాయి వరకూ వెళ్లారు. మంగాదేవి మాట్లాడుతూ నా వార్డులో నాకు తెలియకుండా జాయినింగ్‌లు పెట్టడం ఏంటి.. వార్డుల్లో విభజించి పాలిస్తారా.. ఎంపీ అలా చేయమని చెప్పారా? నాపై కుట్ర చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. అయినా నాకేమీ నష్టం లేదు. ఎంపీని గెలిపించడమే నా లక్ష్యం. రామకృష్ణ మాట్లాడుతూ చక్రవర్తి మీకు ఫోన్ చేసి చెబుతారన్నారు. దీనిపై స్పందించిన మంగాదేవి అతనెవరూ నేను వార్డు ఇన్‌చార్జిని నాకు తెలియకుండా జాయినింగ్స్ ఏంటి.. టౌన్ ప్రెసిడెంట్‌ని కూడా కలుపుకుని చేస్తారని.. యూత్ ప్రెసిడెంట్‌గా మిమ్మల్ని ఇలా ఎంపీ చేయమన్నారా అని ప్రశ్నించారు. శివరాత్రి వెళ్లాక జాయినింగ్స్ పెడదామనుకున్నాం. సిటీ ప్రెసిడెంట్ హరితో కూడా చెప్పాం. ఆయనకు కూడా విలువ లేదా.. యూత్ ప్రెసిడెంట్‌దే హవా అని ఇప్పుడు అర్థమవుతుందని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఎంపీ ఇన్‌చార్జిలను తొక్కేసి పని చేయ మంటున్నారా అని ఆమె ప్రశ్నించారు. ఇలా మాటామాటా పెరిగింది. మేమేమీ ఎంపీని అడ్డుపెట్టుకుని దందాలు చేయడం లేదు. కష్టపడుతున్నామన్నారు. దీనిపై మండిపడిన రామకృష్ణ వాచ్‌మన్ కొడుకుని మీ ఆయన కొట్టేశాడు. వీడియోలు కూడా ఉన్నాయని హెచ్చరించాడు. దీనిపై మంగాదేవి మాట్లాడుతూ వాడు మా ఇంటిలో కుర్రాడు మా ఇష్టం కొడతాం.. మా డబ్బులు ఇవ్వలేదు. అందుకు కొట్టాం అని సమర్థించుకున్నారు. మేమెవరినీ పొడిచేసి దందాలు చేసి రాలేదన్నారు. రామకృష్ణ మాట్లాడుతూ నా జోలికి వస్తే పొడుస్తానని హెచ్చరించారు. సీఐ మా బావ, డీఎస్పీ మావాడు అని బెదిరిస్తున్నారు అన్నారు. మీరు నేను తప్పు చేసినట్టు నిరూపిస్తే మీ కాళ్ల కింద నుంచి దూరి వస్తానని మంగ సవాల్ విసిరింది. మీరు నోరు జారుతున్నారని ఆయన కోప్పడగా, పొడిచేస్తా నన్నావుగా రా... అని ఆమె అనడంతో సంభాషణ కట్ అయింది.

జగన్‌ను నమ్మి మోసపోవద్దు : నెహ్రూ


గోకవరం: కృష్ణుడిపాలెంలో టీడీపీలో చేరిన కార్యకర్తలతో జ్యోతుల నెహ్రూ

గోకవరం, మార్చి 10: అమలు కాని హామీలతో ముఖ్యమంత్రి పీఠాన్ని దక్కించుకున్న జగన్‌ను మరోమారు నమ్మి మోసపోవద్దని జగ్గంపేట మాజీ ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ అన్నారు. మండలంలోని కృష్ణునిపాలెం పంచాయతీ పరిధిలోని వెంకటాపురం, రామన్నపాలెం గ్రామాల్లో వైసీపీ నుంచి ఎస్సీ, బీసీలకు చెందిన సుమారు 100 కుటుంబాల వారు ఆదివారం టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సభలో ఆయన మాట్లాడుతూ గడిచిన ఐదేళ్లలో ఎస్సీ, బీసీలకు వైసీపీ ప్రభుత్వం చేసేందేమి లేదన్నారు. అన్ని కులాలకు సంపూర్ణ న్యాయం జరగాలంటే టీడీపీ, జనసేన, బీజేపీ సంకీర్ణ ప్రభుత్వం అధికారంలోకి రావాలన్నారు. అనంతరం రామన్నపాలెం గ్రామానికి చెందిన జనసేన మండల ఉపాధ్యక్షుడు దుర్గాప్రసాద్‌ను కలిసి తనకు సంపూర్ణ మద్దతు ప్రకటించాలని నెహ్రూ కోరారు. టీడీపీ-జనసేన పొత్తు ధర్మంలో భాగంగా టీడీపీ విజయానికి కృషి చేస్తానని దుర్గాప్రసాద్ హామీ ఇచ్చారు.

రాబోయేది టీడీపీ-జనసేన-బీజేపీ ప్రభుత్వమే : రామకృష్ణారెడ్డి

రంగంపేట, మార్చి 10: రాబోయే రెండు నెలల్లో టీడీపీ-జనసేన-బీజేపీ ప్రభుత్వమే అధికారంలోకి వస్తుందని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని కొత్త వీరంపాలెంలో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రజలకు ఇచ్చిన పట్టాలను ఎవరూ వెనక్కి తీసుకోరని, రెండు నెలల్లో టీడీపీ అధికారంలోకి వచ్చి.. డమ్మి ఇంటి పట్టాలు పంపిణీ చేసినది అధికారులైనా, ప్రజాప్రతినిధులైనా వదిలిపెట్టేది లేదని, అందరిపైనా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆమడదూరం పోయిన అభివృద్ధిని మళ్లీ పట్టాలెక్కించి అభివృద్ధి, సంక్షేమాన్ని సమాంతరంగా అమలు చేస్తామన్నారు. రంగంపేట మండలంలో స్థానిక ఎమ్మెల్యే గెలుపునకు ఎంతో కష్టపడి పనిచేసిన వైసీపీ నాయకులను ఇప్పుడు పట్టించుకుపోవడం దారుణమన్నారు. అనంతరం వైసీపీ నాయకులు మత్సా వెంకటగోపాలం,(చంటిబాబు), మత్సా వీరబాబు, ఉద్దండ్రావు సత్యనారాయణతోపాటు మరో 15 కుటుంబాలు టీడీపీ చేరాయి. వారికి రామకృష్ణారెడ్డి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి అళ్ళ గోవింద్, పూసల శ్రీను, ఉద్దండ్రావు శ్రీను, ఉండవిల్లి గిరిబాబు తదితరులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా రామకృష్ణారెడ్డి సతీమణి మహాలక్ష్మి పాతవీరంపాలెంలో పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి సూపర్‌సిక్స్ పథకాల ద్వారా పొందే లబ్ధిని వివరించి కరపత్రాలను పంపిణీ చేశారు. రాబోయే ఎన్నికల్లో టీడీపీకి ఓటువేసి గెలిపించాలని కోరారు.


రంగంపేట: కేవీ పాలెంలో టీడీపీలోకి ఆహ్వానిస్తున్న రామకృష్ణారెడ్డి

జనసేన-టీడీపీ-బీజేపీ కూటమిదే విజయం

▸ జనసేన ఆత్మీయ సమావేశంలో అనుశ్రీ సత్యనారాయణ


జనసేనలో చేరిన కార్యకర్తలతో ఆదిరెడ్డి వాసు, అనుశ్రీ

రాజమహేంద్రవరం, మార్చి 10(ఆంధ్రజ్యోతి): కొద్ది రోజుల్లో జరగబోయే సార్వత్రిక ఎన్నికల్లో జనసేన, టీడీపీ, బీజేపీ కూటమి విజయం ఖాయమని జనసేన రాజమహేంద్రవరం సిటీ ఇన్‌చార్జి అత్తి(అనుశ్రీ) సత్యనారాయణ అన్నారు. స్థానిక జగదీశ్వరి హోటల్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన జనసేన కార్యకర్తలు,నేతల ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ వారంలోనే ఎన్నికల షెడ్యూల్ రానుందని తెలిపారు. ప్రతి కార్యకర్త ప్రతి ఇంటికి వెళ్లాలి. ప్రతి ఓటు మనకే పడేలా కృషి చేయాలన్నారు. కమీషన్ల కోసం రాజమహేంద్రవరం నగరాన్ని నాశనం చేసిన వైసీపీ నేతలకు కనువిప్పు కలిగేలా కూటమి అభ్యర్థి వాసును అత్యధిక మెజార్టీతో గెలిపించాలన్నారు.ఉమ్మడి అభ్యర్థి, టీడీపీ నేత ఆదిరెడ్డి వాసు, మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు మాట్లాడుతూ గత ఎన్నికల్లో జగన్ అబద్ధపు హామీలతో ముఖ్యమంత్రి పదవి పొంది, రాష్ట్రాన్ని నాశనం చేశాడన్నారు. రానున్న ఎన్నికల్లో జగన్ సైకో పాలన నుంచి రాష్ట్రాన్ని విముక్తి చేయడానికి అందరూ కృషి చేయాలన్నారు. అనంతరం సిటీ పరిధిలోని 6వ వార్డుకు చెందిన టి.నాగరాజు బృందం, 37వ వార్డుకు చెందిన డి.శ్రీనివాస్ మిత్ర బృందం పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర, జిల్లా, నగరకమిటీ సభ్యులు పాల్గొన్నారు

టీడీపీ శంఖారావం సభకు భారీ ఊరేగింపు


భారీ ఊరేగింపుగా సభకు వెళ్తున్న ఆదిరెడ్డి, రామ్మోహన్, అనుశ్రీ

రాజమహేంద్రవరం సిటీ, మార్చి 10: రాజమహేంద్రవరంలో టీడీపీ-జనసేన అభ్యర్థి ఆదిరెడ్డి శ్రీనివాస్ నిర్వహించిన ఎన్నికల శంఖారావం సభకు భారీగా ప్రజలు తరలివచ్చారు. వేలాది మంది రాజమహేంద్రవరంలో ఆర్‌కాం ఫ్లెక్స్ రోడ్డు, తిలక్ రోడ్డు, మోరంపూడి రోడ్డుల గుండా వాహనాలలో రావడంతో ఆ ప్రాంత మంది ప్రజలతో నిండిపోయింది. రాజమండ్రి పుష్కరాల రేవు నుంచి ఆదిరెడ్డి వాసు, శ్రీకాకుళం ఎంపీ కింజరపు రామోహ్మనాయుడులు కలిసి వాహనంలో సుమారు వెయ్యి మంది కార్యకర్తలతో ముందు బైక్‌లతో మోరంపూడి వరకు ఊరేగింపు నిర్వహించారు. సాయంత్ర 6:30 గంటలకు మోరంపూడి జెమిని గ్రౌండ్స్‌కు చేరుకున్నారు.

ఓటు హక్కును నిర్భయంగా వినియోగించుకోండి


బిక్కవోలులో కవాతు చేస్తున్న కేంద్ర బలగాలు

బిక్కవోలు, మార్చి 10: ఓటు హక్కును నిర్భయంగా వినియోగించుకోవాలని ట్రైనీ డీఎస్పీ భానోదయ ఓటర్లకు పిలుపునిచ్చారు. త్వరలో సాధారణ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఆదివారం బిక్కవోలు మెయిన్‌రోడ్‌లో కేంద్ర బలగాలు నిర్వహించిన కవాతులో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎటువంటి ప్రలోభాలు, ఒత్తిళ్లు, బెదిరింపులకు తలొగ్గకుండా ఓటు హక్కును వినియోగించుకోవాలని ఓటర్లకు అవగాహన కల్పించారు. ఈ కవాతులో సీఐ శివగణేష్, ఎస్ఐ బుజ్జిబాబు, కేంద్ర బలగాలు పాల్గొన్నాయి.

కడియం: మండలంలోని వేమగిరిలో డీఎస్పీ ఎం.అంబికాప్రసాద్, సీఐ బి.తులసీధర్ ఆధ్వర్యంలో సాయుధ బలగాలతో పోలీసు అధికారులు కవాతు నిర్వహించారు. రానున్న ఎన్నికల నేపథ్యంలో ప్రజల్లో భయాందోళనలు పోగొట్టి ప్రతిఒక్కరూ ఓటుహక్కును స్వేచ్ఛగా వినియోగించుకునే విధంగా ఈ ఫ్లాగ్ మార్చ్ చేశారు.

ముగిసిన మహాశివరాత్రి ఉత్సవాలు



రంగంపేట, మార్చి 10: రంగంపేటలోని ఉమారామ లింగేశ్వరస్వామి దేవస్థానంలో మహాశివరాత్రి ఉత్సవాలు శనివారం రాత్రి పూర్ణాహుతి, స్వామివారి శ్రీ పుష్పయాగం కార్యక్రమాలతో ఘనంగా ముగిసాయి. ఈ సందర్భంగా కంటిపూడి దుర్గాప్రసాద్, మహాలక్ష్మి దంపతులతో ఆలయార్చకులు స్వామివారి ఉత్సవమూర్తులకు శ్రీపుష్పయాగం పూజలు చేయించారు. కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

సూర్యనారాయణమూర్తికి పూజలు

ముగిసిన మాఘమాస ఉత్సవాలు


సూర్యనారాయణుడికి పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

కోరుకొండ, మార్చి 10: మాఘమాసం ముగింపు సందర్భంగా కోరుకొండ హరేరామ సమాజం వద్ద సూర్యనారాయణమూర్తి ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహించారు. ఈ సందర్భంగా విష్ణు సహస్ర నామం, ఆదిత్య హృదయం, సూర్యఅష్టకం, సూర్యశోస్త్రం, సూర్య అష్టోత్తర శత నామావళి పారాయణం చేశారు. అర్చకులు స్వామి వారికి ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు జరిపారు. కార్యక్రమంలో హరేరామ సమాజ మహిళా బృందం కొటికలపూడి లక్ష్మీకాంతం, నాగ శిరోమణి, చేర్ల రాజ్యలక్ష్మి, సత్యవతి, సునీత, పద్మ, సుమారు 100 మంది మహిళలు పాల్గొన్నారు. స్థానిక అపర్ణ ఏజెన్సీ వీరందరికీ రవికలు అందజేసింది.

కిషోర్‌కు ఉత్తమ సామాజిక సేవారత్న అవార్డు

రంగంపేట, మార్చి, 10: మన హక్కులకై పోరాడు సాధించు ఉద్యమ సంస్థ జిల్లా అధ్యక్షుడు, బీసీఎన్ ఎలక్ట్రానిక్ మీడియా మండల రిపోర్టర్ కోడి కిషోర్‌కు ఉత్తమ సామాజిక సేవా రత్న అవార్డు లభించింది. విజయవాడలో వాసవ్య మహిళా మండలి భవనంలో ఇండియన్ యాక్ట్స్ ఎవెర్నెస్ వలంటీర్ ఆర్గనైజేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు అయ్యంకి సురేష్‌బాబు ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా సయ్యద్‌లాల్ సాహెబ్ అధ్యక్షతన మహిళా చట్టాలపై, ఉత్తమ సమాజ సేవకుల అవగాహన సదస్సుకు ఏపీఎస్పీ డీఐజీ బి.రాజకుమారి ముఖ్యతిథిగా విచ్చేశారు. ఆమె చేతుల మీదుగా కిషోర్ ఉత్తమ సేవారత్న అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయనకు పలువురు అభినందనలు తెలిపారు.

దిష్టి బొమ్మ దహనం విష సంస్కృతి

టీడీపీ కడియం అధ్యక్షుడు వెలుగుబంటి నాని


కడియంలో ఎమ్మెల్యే గోరంట్ల చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న దృశ్యం

కడియం, మార్చి 10: దిష్టిబొమ్మ దహనం విషసంస్కృతికి చిహ్నమని, అలాంటి జేషజాలు బీసీ వర్గాల విభజనకు దారి తీసే విధంగా మంత్రి చెల్లుబోయిన వేణు చర్యలు ఉన్నాయని టీడీపీ మండలాధ్యక్షుడు వెలుగుబంటి రఘురామ్(నాని) అన్నారు. ఆదివారం ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి చిత్రపటంతో ఎంపీపీ వెలుగుబంటి ప్రసాద్ కార్యాలయం నుంచి పాదయాత్రగా దేవీచౌక్ సెంటర్ వరకు వెళ్లి చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా టీడీపీ రాష్ట్ర రైతు ఉపాధ్యక్షుడు మార్గాని సత్యనారాయణ, చెల్లుబోయిన శ్రీనివాస్, పితాని శివరామకృష్ణ, ముత్తాబత్తుల విజయ, యనమదల రాజు మాట్లాడుతూ రామచంద్రపురంలో మంత్రిగా వేణు చేసిన అభివృద్ధి ప్రజలకు తెలుసని, అక్కడ ఏమి లేదు కాబట్టే ఇక్కడకు పంపారని ఎద్దేవా చేశారు. మహిళలు దిష్టిబొమ్మను దహనం చేసిన ప్రాంతాన్ని పాలతో సంప్రోక్షణ చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు అన్నందేవుల చంటి, బోడపాటి గోపి, వాసంశెట్టి నాగబాబు, జల్లి కృపారావు, గుర్రపు సత్యనారాయణ పాల్గొన్నారు.

దేశానికి జవాన్, కిసాన్ పాలనకావాలి

భారతీయ జవాన్ కిసాన్ పార్టీ నేషనల్ కోఆర్డినేటర్ మోహనరావు

రాజమహేంద్రవరం సిటీ, మార్చి 10: దేశం కోసం ప్రాణాలర్పించే జవాన్, ప్రజలకు తిండిపెట్టే కిసాన్‌ల పాలన కావాలని భారతీయ జవాన్ కిసాన్ పార్టీ నేషనల్ కోఆర్డినేటర్ సుదరి మోహనరావు అన్నారు. రాజమండ్రి ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం ఆయన మాట్లాడారు. శక్తివంతమైన పాలన జవాన్ కిసాన్‌ల వల్లనే సాధమవుతుందన్నారు. విద్య, వైద్యం, సమాంతర న్యాయం మూడు అంశాలనే తమ ఎన్నికల మెనిఫెస్టోలో ప్రధాన అంశాలుగా చేర్చి ఎన్నికలకు సిద్ధమవుతున్నామన్నారు. దేశంలో అసెంబ్లీ నియోజకవర్గాల్లో తాము పోటీ చేయడంలేదని అన్ని పార్లమెంట్ స్థానాల్లో పోటీ చేస్తామని చెప్పారు. ప్రజాస్వామ్యంలో మాజీ సైనిక ఉద్యోగులంతా పాలుపంచుకోవాలని ఈ పార్టీని స్థాపించామన్నారు. రాజమండ్రి పార్లమెంట్ అభ్యర్థిగా బంగారు కృష్ణమూర్తిని పోటీకి నిలబెడుతున్నామన్నారు. సమావేశంలో పార్టీ న్యాయసలహాదారులు అబ్దుల్ సలామ్, రాష్ట్ర కార్యదర్శి శివప్రసాద్ కుమార్, టి.రామ్‌కుమార్(ప్రొద్దుటూరు), నెల్లూరి సుషిత (కడప), రమణస్వామి, రాజేశ్వరరావు, తెలంగాణ నాయకుడు యోగేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

చదువుల తల్లి సావిత్రిబాయి పూలే

రాజమహేంద్రవరం సిటీ, మార్చి 10: సావిత్రిబాయి పూలే 193 ఏళ్ళ క్రితం పుట్టి ఒక సంఘసంస్కర్తగా అవతరించి మహిళలు పురుషులతో సమానంగా బతికే హక్కు సాధించాలని పెద్ద పోరాటం చేసి చదువుల తల్లిగా నిలిచారని ఎస్సీ ఎస్టీ రాష్ట్ర సంక్షేమ సంఘం అధ్యక్షుడు కోరుకొండ చిరంజీవి అన్నారు.రాజమహేంద్రవరం గణేష్ చౌక్‌లోని వెనుకబడి తరగతుల కళాశాల వసతి గృహంలో ఆదివారం సావిత్రి బాయి పూలే 127వ వర్ధంతిని నిర్వహించారు.ఆమె విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎస్సీ రైట్స్ ప్రొటెక్షన్ రాష్ట్ర అధ్యక్షుడు తాళ్ళూరి బాబు రాజేంద్రప్రసాద్, ధారా ఏసురత్నం, డీఎల్ఎస్ఏ సభ్యులు పాము బాబూరావు, వసతిగృహఅధికారి ముమ్మిడిసత్యకుమారి పాల్గొన్నారు.

సమాజానికి సాహిత్యం అవసరం

రాజమహేంద్రవరం అర్బన్, మార్చి 10: సాహిత్యం లేకపోతే మానవ మనుగడలో సంతోషం ఉండదని, సమాజానికి సాహిత్యం అవసరం ఉందని కళాగౌతమి వ్యవస్థాపకుడు బీవీఎస్ మూర్తి అన్నారు. కందుకూరి వీరేశలింగం నాటక సమాజం ప్రాంగణంలో కళాగౌతమి ప్రతి రెండో ఆదివారం నిర్వహించే రచయితల సమావేశంలో ఎంవీ రమేష్ రచించిన జానకి రాముల జీవన యానం అనే పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో రిటైర్డు ప్రిన్సిపాల్ అద్దేపల్లి సుగుణ, కళాగౌతమి అధ్యక్షుడు పీవీబీ సంజీవ రావు ,చాగంటి మాలతి, కళాగౌతమి కార్యదర్శి రమాదేవి, వీవీ సుబ్రహ్మణ్యం, సప్పా దుర్గాప్రసాద్, ఏ కోదండరావు పాల్గొన్నారు.

వాహనం ఢీకొని వ్యక్తి మృతి


మృతుడు శ్రీనివాస్

గోకవరం, మార్చి 10: గుర్తు తెలియని వాహనం ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన ఆదివారం రాత్రి గోకవరంలో జరిగింది. గోకవరంలోని అచ్చియ్యపేటకు చెందిన రాజాని శ్రీనివాస్(40) మరో వ్యక్తితో కలిసి మోటారుసైకిల్‌పై తంటికొండ వైపు నుంచి గోకవరం వైపునకు వస్తుండగా గుర్తుతెలియని వాహనం ఢీకొట్టింది. ఈ ఘటనలో శ్రీనివాస్ అక్కడికక్కడే మృతి చెందాడు. బైక్‌పై ప్రయాణం చేస్తున్న మరో వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. కాగా శ్రీనివాస్ తాపీ పని చేసుకుంటున్నాడని, అతడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారని సమాచారం.

దుర్గామల్లేశ్వరునికి ప్రత్యేక పూజలు

దేవరపల్లి, మార్చి 10: మండలంలోని పల్లంట్లలో శివరాత్రి ఉత్సవాల్లో భాగంగా దుర్గామల్లేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయార్చకులు పల్లకీసేవా, పుష్పయోగం జరిపారు. ఆలయ కమిటీ సభ్యుడు బలుసు సత్యనారాయణ, విజయలక్ష్మి దంపతులు పూజలు, హోమాలు చేపట్టారు. అనంతరం నిర్వహించిన భారీ అన్నసమారాధనలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

టీడీపీ సీటు శేషారావుకు కేటాయించాలి

కాల్దరిలో నాయకులు, కార్యకర్తల కొవ్వొత్తుల ర్యాలీ

ఉండ్రాజవరం, మార్చి 10: నిడదవోలు టీడీపీ ఎమ్మెల్యే సీటును బూరుగుపల్లి శేషారావుకు కేటాయించాలని మండలంలోని కాల్దారి గ్రామంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఆదివారం రాత్రి కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. స్థానిక ఎన్‌టీఆర్ విగ్రహం వద్ద పూలమాలలతో నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ గెలిచే వ్యక్తి ప్రజాభిమానం పొందిన వ్యక్తి శేషారావుకే టీడీపీ-జనసేన నాయకత్వం సీటు కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో కొమ్మిన వెంకటేశ్వరరావు, సింహాద్రి రామకృష్ణ, నాయకులు రాచమళ్ళ శ్రీనివాస్, ఈర్పిన సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.





సభలో మాట్లాడుతున్న యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అరుణకుమారి

పాత పింఛను ఇచ్చే పార్టీకే మద్దతు

యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అరుణకుమారి

కొవ్వూరు, మార్చి 10 : ఉద్యోగ, ఉపాధ్యాయులకు పాత పింఛను విధానాన్ని అమలుచేస్తామని మాటిచ్చిన రాజకీయపార్టీకే ఉపాధ్యాయ సంఘాలు మద్దతు తెలుపుతాయని యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎన్. అరుణకుమారి తెలిపారు. కొవ్వూరు ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో ఆదివారం యూటీఎఫ్ జిల్లా సహాయ అధ్యక్షురాలు విజయగౌరి అధ్యక్షతన నిర్వహించిన అంతర్జాతీయ మహిళా దినోత్సవంలో ఆమె మాట్లాడారు.వైసీపీ ప్రభుత్వం అధికారం చేపట్టిన వారం రోజుల్లో సీపీఎస్ విధానాన్ని రద్దు చేస్తామని చెప్పి ఉద్యోగులను దారుణంగా మోసం చేసిందన్నారు. పాత పింఛను విధానాన్ని ప్రభుత్వం పూర్తిగా తుంగలో తొక్కేసిందన్నారు. సీపీఎస్, జీపీఎస్ విధానాలను ఉపాధ్యాయ సంఘాలు పూర్తిగా వ్యతిరేకిస్తున్నాయన్నారు. మహిళలపై లైంగికదాడులు పెరిగిపోయి వారు పనిచేస్తున్న చోట భద్రత లేకుండా పోయిందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మహిళల భద్రతకు చట్టాలు చేసి చిత్తశుద్ధితో అమలు చేయాలన్నారు. రానున్న ఎన్నికల్లో మహిళలకు సీట్లు పెంచి వారిలో ఆత్మస్థైర్యాన్ని నింపాలన్నారు. జీవో నెంబరు 177ను రద్దు చేయాలన్నారు. ఇప్పటికైనా సీఎం జగన్ పాదయాత్రలో ఇచ్చిన హామీ మేరకు ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించి, సీపీఎస్‌ను రద్దుచేసి పాత పింఛను విధానాన్ని అమలు పర్చాలని డిమాండ్ చేశారు. ఐద్వా జిల్లా అధ్యక్షురాలు జరీనా మాట్లాడుతూ ఉపాధ్యాయుల రెండేళ్ల అప్రంటీస్ విధానాన్ని ఉపసంహరించాలన్నారు. జిల్లా బాలోత్సవ కమిటీ కన్వీనర్ ఇ.శ్రీమణి మాట్లాడుతూ పిల్లల సంరక్షణకై కేంద్ర ప్రభుత్వం మాదిరిగా రాష్ట్ర ప్రభుత్వం రెండేళ్ల చైల్డ్‌కేర్ లీవులను మంజూరు చేయాలన్నారు. మహిళలకు పోటీలు నిర్వహించి బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు పి.జయకర్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.షరీఫ్, రూపస్, ఇవీఎస్ఎస్ఆర్.ప్రసాద్, రమేష్, ఎస్.భవాని, ఎస్.అనిత, ఐ.రాజేశ్వరి, శ్రీనివాస్, ప్రకాష్, అంగన్వాడీ జిల్లా కార్యదర్శి కె.బేబి రాణి, ఆశా యూనియన్ అధ్యక్షురాలు ఎస్. అన్నామణి పాల్గొన్నారు.

కొవ్వూరు డీవైఈవోగా వాసుదేవరావు



కొవ్వూరు, మార్చి 10 : ఎట్టకేలకు కొవ్వూరు విద్యా డివిజన్ ఏర్పాటు చేశారు. జిల్లా విద్యాశాఖాధికారిగా విధులు నిర్వహిస్తున్న కె.వాసుదేవరావు ఆదివారం రాత్రి కొవ్వూరు డివిజన్ ఉప విద్యాశాఖాధికారిగా (పూర్తి అదనపు బాధ్యతలు) ఎఫ్ఏసీగా బాధ్యతలు స్వీకరించారు. రాష్ట్రంలో కొత్త జిల్లాలు ఏర్పడిన నాటి నుంచి ఇప్పటి వరకు కొవ్వూరు డివిజన్‌లో విద్యా డివిజన్ ఏర్పడలేదు. 18 మంది ఎంఈవోలు, 82 ఉన్నత పాఠశాలలు ఉపాధ్యాయులు ఉన్న కొవ్వూరు డివిజన్‌కు కె.వాసుదేవరావును డివిజనల్ ఉప విద్యాశాఖాధికారిగా నియమించడం పట్ల టీచర్లు హర్షం వ్యక్తం చేస్తున్నారు. స్థానిక ఎంఈవో కార్యాలయంలోనే ఆదివారం వాసుదేవరావు బాధ్యతలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో రాజమహేంద్రవరం డివిజన్ ఉప విద్యాశాఖాధికారి ఈవీబీఎన్. నారాయణ, ఎంఈవోలు జె.కెంపురత్నం, రామకిషోర్, ప్రసాద్, ప్రధానోపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ శివరాత్రి ఆదాయం రూ.10.91 లక్షలు

రాజమహేంద్రవరం అర్బన్, మార్చి 10 : మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని జిల్లాలోని వివిధ పుణ్యక్షేత్రాలకు స్పెషల్ సర్వీసులు నడపడం ద్వారా జిల్లా ఆర్టీసీ రూ.10,91,730లు ఆదాయం ఆర్జించినట్టు ఆర్టీసీ జిల్లా అధికారిణి షర్మిల అశోక ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని గోకవరం, కొవ్వూరు, నిడదవోలు, రాజమహేంద్రవరం డిపోల నుంచి మొత్తం 59 స్పెషల్ సర్వీసులు నడపడం ద్వారా 29,400 మంది ప్రయాణీకులకు సేవలందించగా మంచి ఆదాయం లభించిందన్నారు.

జగన్ సిద్ధం సభకు 30 ఆర్టీసీ బస్సులు

రాజమహేంద్రవరం, మార్చి 10 (ఆంధ్రజ్యోతి) : గుంటూరు జిల్లా అద్దంకిలో జరిగిన వైసీపీ సిద్ధం సభకు రాజమహేంద్రవరం ఆర్టీసీ డిపో నుంచి 30 బస్సులను తరలించారు. కానీ ఇక్కడ నుంచి జనం లేరు. ఆయా ప్రాంతాల్లోని జనాన్ని తరలించడానికి బస్సులు పురమాయించారు.

మద్యంపై మాట తప్పారు.. ఓటెలా అడుగుతారు!



అది 2019 మే 26.. తన ప్రమాణ స్వీకారానికి ప్రధానిని, ఇతర ప్రముఖులను ఆహ్వానించడానికి జగన్ హస్తినకు వెళ్లారు. అప్పుడు.. అంటే అదే రోజున దేశ రాజధానిలో మీడియా సమావేశంలో మాట్లాడారు. వైసీపీ మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మద్యపాన నిషేధంపై పాత్రికేయులు ప్రశ్నించారు. అప్పుడు జగన్ "మద్యపాన నిషేధానికి సంబంధించి నేను చాలా క్లియర్‌గా చెప్పాను. క్రమంగా అమలు చేస్తాం. దశల వారీ పద్ధతుల్లో నిషేధిస్తామనే చెప్పాం. దానికి కట్టుబడి ఉన్నాం. 2024 ఎలక్షన్స్ సమయానికి మాత్రం కచ్చితంగా మద్యాన్ని ఫైవ్‌స్టార్ హోటల్స్‌కి మాత్రమే పరిమితం చేసిన తర్వాతే 'నేను ఓట్లు అడుగుతాను. అది మాత్రం కచ్చితంగా చెప్పి ఉన్నాను'. మేనిఫెస్టోలో కూడా కరెక్టుగా ఇదే చెప్పాను. మేనిఫెస్టోని నేను ఖురాన్, బైబిల్, భగవద్గీతగా భావిస్తాను" అని వ్యాఖ్యానించారు. అయితే అధికారంలోకి వచ్చిన వెంటనే అవే మతగ్రంథాల 'సాక్షి'గా హామీని మద్యంలో ముంచేశారు. ఇదీ జగన్ సర్కారు వారి బూటకపు మాటల మద్య నిషేధ కథా చిత్రమ్.

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

2024కి మద్య నిషేధం చేయకపోతే ఓటు అడగనన్న జగన్

- దశల వారీ మద్య నిషేధం గాలికి
- జిల్లాలోనే 158 షాపులు
- పేరుకే ప్రభుత్వ మద్యం దుకాణాలు
- విచ్చలవిడిగా సాగుతున్న అమ్మకాలు
- భారీగా ధర పెంచేసిన ప్రభుత్వం
- తాగుబోతుల జేబుకు చిల్లు
- చిరుకుటుంబాల్లో కల్లోలం
- నాణ్యత లేని బ్రాండ్లు
- చెడిపోయిన పేదోడి ఆరోగ్యం
- పెరిగిన బెల్ట్, సారా దుకాణాలు
- నేడు సిద్ధమంటూ జగన్ సభలు

మాట తప్పి మడమ తిప్పి మళ్లీ ఇప్పుడు ఎన్నికల్లో మేనిఫెస్టోతో ఓట్లు దండుకోవడానికి 'సిద్ధం' అయ్యారు. మద్యం అమ్మకాలను తగ్గించడం దేవుడెరుగు!.. మద్యం అమ్మకాల ఆదాయం పైనే ప్రభుత్వాన్ని ఇన్నేళ్లు నడిపించడం చూస్తే జగన్ ఉల్టా మాటలు నమ్మిన జనాన్ని పల్టీ కొట్టించారని అర్థమవుతోంది.ఆయన 2019 మే 30న సీఎంగా ప్రమాణం చేశారు. మరో మూడు నెలల్లో ఆయన ప్రమాణానికి ఆయువు తీరుతుంది. కానీ ఆయన ఖురాన్, బైబిల్, భగవద్గీతలా భావించే మేనిఫెస్టోలోని మద్యపాన నిషేధ హామీని నేటి వరకూ అమలు చేయలేకపోయారు. పైగా మద్యంపై వచ్చే ఆదాయాన్ని పరుగులు పెట్టించారు. మద్యం అమ్మకాలను తగ్గించకపోగా ప్రోత్సహిస్తూ 'సీసాలు వేరు వాటిలోని సారా ఒకటే' అనే చందంగా నాణ్యతను దిగజార్చారు.ఐదేళ్లుగా రంగుసారాను ఏరులా పారించి జనాల ఊపిరిని గుటుక్కుమనిపించారు. దేశంలో ఏ సీఎం చేయని విధంగా మద్యంపై రానున్న 15 ఏళ్లలో వచ్చే ఆదాయాన్నితాకట్టుపెట్టి వేల కోట్ల రూపాయలు అప్పు తెచ్చిన పాలకుడిగా చరిత్రలో నిలిచారు. గతంలో ఎన్నడు లేని ధర కుటుంబాలను ఆర్థికంగా ఛిద్రం చేస్తుంటే.నాణ్యతలేని సరుకు ఆరోగ్యాన్ని నాశనం చేస్తోంది.

జేబుకు చిల్లు.. ఆరోగ్యం గుల్ల

పేదోళ్లు.. మధ్యతరగతి మందుబాబులు.. పెగ్గు అల వాటైన ప్రాణాలు. పగలంతా శ్రమించి ఓ చుక్క గొంతులో పోసుకొని సేదతీరదామను కొనే చిన్న బతుకులు.. పెగ్గు గొంతులో పోసుకోలేని దుస్థితి.జగన్ ప్రభుత్వం వచ్చాక రోజువారీ శ్రమలో అధికశాతం సర్కారుకు మద్యం రూపంలో ముట్టజెబుతున్నారు. ఆరోగ్యాన్నీ పణంగా పెడుతున్నారు. ఈ ఐదేళ్లలో నాణ్యతలేని, కల్తీ మద్యం తాగడం వల్ల ప్రాణాలను సర్కారుకు అర్పించిన వారిలో అధిక శాతం పేదలే ఉన్నారు. ఒకేసారి పది మందికిపైగా చనిపోయిన ఘటనలు ఉన్నాయి. వైసీపీ ప్రభుత్వం వచ్చిన వెంటనే మద్యం పాలసీని ప్రపంచంలోనే ఎవరూ ఊహించని కొత్త అడ్డదార్లు తొక్కించారు. ప్రభుత్వ మద్యం దుకాణాలను తెరపైకి తెచ్చారు. ధరలను విపరీతంగా పెంచేశారు. గత ప్రభుత్వంలో గజిబిజి మద్యం పాలసీ ఉండేది కాదు. అప్పుడు క్వార్టరు(180ఎంఎల్) నాణ్యమైన సరుకు రూ.120కే దొరికేది. ఆ ధరను అమాంతం రూ.200 చేసేశారు. 'జే' బ్రాండ్లతో షాపులను నింపేశారు. తర్వాత దశల వారీగా అమ్మకాలు ఎక్కువగా ఉన్న బ్రాండ్లకు మళ్లీ క్వార్టరుకు రూ.30 అదనంగా తగిలించారు. ఇలా క్వార్టరు రూ.230 అయిపోయింది. సారా వల్ల ఆరోగ్యాలకు ఇబ్బంది కలుగుతోందని గ్రహించిన గత ప్రభుత్వ పాలకులు చీఫ్ లిక్కర్‌ని అందుబాటులోకి తెచ్చారు. ఈ మందు ప్రమాణాల ప్రకారం డిస్టిలరీల్లో తయారయ్యేది. అయినా దాని ధర మాత్రం రూ.60 మించలేదు. ఇప్పుడు రంగు సారాను, హానికర రసాయనాలను సీసాల్లో నింపి రూ.150కి విక్రయిస్తున్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో లైసెన్సు పొందిన మందు షాపులు ఉండేవి. ఎంఆర్పీపై ఒక్క రూపాయి కూడా అధికంగా వినియోగదారుల వద్ద నుంచి తీసుకోకుండా ప్రభుత్వమే దుకాణదారులకు 15 శాతం కమిషన్ ఇచ్చేది.వైసీపీ ప్రభుత్వం వచ్చాక ఆ విధానాన్ని తీసేసింది. అసలే ఎంఆర్పీ అధికమంటే దానిపై ఎంత ఎక్కువకైనా అమ్ముకోవచ్చంటూ బార్‌లకు ధరలను ధారాదత్తం చేస్తూ ఆదేశాలు ఇచ్చేసింది. దీంతో గత ప్రభుత్వంలో రూ.60కి దొరికే చీఫ్ లిక్కర్ ఇప్పుడు బార్‌లో కొనాలంటే రూ.210 అవుతోంది. రోజంతా కష్టపడితే రూ.500 వస్తే గతంలో సుమారు రూ.400 ఇంటికి తీసుకెళ్లేవారు. మద్యం అలవాటు ఉన్న వాళ్లు ఇప్పుడు రూ.100కూడా కొంపకు చేర్చడం కష్టమవుతోంది. దీంతో కుటుంబాలు ఆర్థికంగా చితికిపోతున్నాయి. పైగా నాణ్యత లేని మద్యం, కల్తీ మద్యం వల్ల ఆరోగ్యాలు దెబ్బతింటున్నాయి. దీంతో జనాలు అనారోగ్యాలపాలై ఆస్పత్రుల ఖర్చులకు అప్పులపాలు అవుతున్నారు. లివర్, కిడ్నీ, గుండె సంబంధిత వ్యాధులు ఈ మూడేళ్లలో విపరీతంగా పెరిగిపోయాయి.ఎన్నో ఏళ్ల నుంచి మద్యం అలవాటు ఉన్న వారికి ఈ ఐదేళ్లు విషమ పరీక్షలు పెట్టింది.శరీరంలోని అవయవాలను నాశనం చేసింది.



సీతానగరం మండలం రఘుదేవరపురంలో వైఎస్ఆర్ ఆసరా సభను ఆదివారం నిర్వహించారు. ఈ సభకు నయానో భయానో పెద్ద ఎత్తున మహిళలను తరలించారు.. చాలా మంది మహిళలు వచ్చారుగా స్పందన ఎలా ఉందో చూద్దామని మైక్ ఇచ్చి మాట్లాడమన్నారు.. అంతే ఒక పెద్దావిడ పేరు మంగమ్మ లేచింది.. మద్యంతో కుటుంబాలు ఛిన్నాభిన్నం అవుతున్నాయి.. వీధికో బ్రాందీషాపు పెట్టేశారు.. మద్యం నిషేధం చేస్తామన్నారు.. ఏమైందని ప్రశ్నించారు..అంతే వైసీపీ నాయకులు అవాక్కయ్యారు. వెంటనే మైక్ లాగేసుకున్నారు.. - సీతానగరం

మళ్లీ సారా కోరల్లో పేదోడు

వైసీపీ ప్రభుత్వం వచ్చాక మళ్లీ సారా మహమ్మారి కోరల్లో పేదోడు చిక్కుకున్నాడు. ప్రభుత్వ మద్యం దుకాణాల్లో రంగుసారా.. బయట రంగులేనిసారా నిర్విరామంగా లభ్యమవుతోంది. సారా అరికట్టడానికి ఎస్ఈబీ అనే విభాగాన్ని వైసీపీ ప్రభుత్వం సృష్టించినా ఆ మేరకు ఫలితాలు కానరాని పరిస్థితి. దీంతో పోలీసులు అడపాదడపా తలచుకుంటేనే వందల లీటర్ల సారా, బెల్లం ఊట బయపడుతోంది. గత ప్రభుత్వంలో నాణ్యమైన మందును చీఫ్ పేరుతో రూ.60కే క్వార్టరు అందుబాటులోకి తేవడంతో సారా వాడకం గణనీయంగా తగ్గింది. దీంతో తయారీదారులు కనుమరుగయ్యారు. వైసీపీ ప్రభుత్వం వచ్చాక మళ్లీ వారి వ్యాపారం మూడు ప్యాకెట్లు ఆరు సీసాలు అనే మాదిరిగా నడుస్తోంది. చీఫ్‌కి సారాకి నాణ్యతలో తేడా లేకపోవడం.. ధరల్లో భారీగా వ్యత్యాసం ఉండడంతో పేదలు సారావైపు మళ్లీ విపరీతంగా మళ్లారు. వేల లీటర్లలో సారా తయారు అవుతూ పట్టణాలకు సైతం సరఫరా అవుతోంది. చాలా చోట్ల సారా దుకాణాలు బెల్టుషాపులుగానూ అప్‌గ్రేడ్ అయ్యాయి. దీంతో ప్రభుత్వ మద్యం, సారా రెండూ అక్కడే లభ్యమవు తున్నాయి. మద్యం అమ్మకాల ద్వారా ఆదాయం పెంపుపై తీవ్రంగా దృష్టి సారిస్తున్న ప్రభుత్వం టార్గెట్లు పెట్టి మరీ ఎక్సైజ్ శాఖపై బాగా ఒత్తిడి పెంచుతోంది. పండుగల వేళ అది మరీ అధికరం. దీంతో జనాలతో పూటుగా తాగిస్తున్నారు. తూర్పుగోదావరి జిల్లాలో 137 మద్యం దుకాణాలు, 21 బార్లలో మద్యం లభ్యమవుతోంది. వీటిలో అధికంగా జిల్లా కేంద్రమైన రాజమహేంద్రవరంలోనే ఉన్నాయి. 19మండలాల్లో 158మద్యం దుకాణాలు చాలవన్నట్టుగా వాక్ఇన్ స్టోర్స్‌ని ప్రభుత్వం మొదలుపెట్టింది. ఇప్పుడు వీటికి బెల్టుషాపులు జతకలిశాయి. గతంలో మందు కావాలంటే ప్రభుత్వం లైసెన్సు ఇచ్చిన షాపునకు వెళ్లి కొనుక్కోవాల్సిందే. కానీ ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. గడప గడపకూ మందు అందాలన్నదే జగన్ ప్రభుత్వ లక్ష్యంగా కనిపిస్తోందనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ప్రభుత్వ మద్యం దుకాణం.. వాక్ఇన్ స్టోర్స్. బార్లు.. ఆ పది అడుగులు కూడా వేయలేమనంటే ఇంటి సమీపంలోనే బెల్టు షాపు. అక్కడ కొనుక్కొనేంత డబ్బులు లేవంటే దగ్గర్లోనే సారాయిదుకాణం. ఇవన్నీ కలుపుకొంటే జిల్లాలో సారాయి దుకాణాలు, బెల్టుషాపులు కలిపి వందల్లో నడుస్తున్నట్టు తెలుస్తోంది. ఇలా అందుబాటులో ఉన్న అన్నిచోట్లా మద్యం లభ్యమవుతోంది. జిల్లాలో మద్యం అమ్మకాలు నెలకు రూ.100 కోట్లు దాటాయంటే జనం సొమ్ము ఎంత పెద్ద మొత్తంలో ఖజానాకు చేరుతోందో అర్థం చేసుకోవచ్చు.

దగా జగన్‌కి బుద్ధి చెబుతాం

మద్య నిషేధమంటూ దగా మాటలు చెబుతారని మహిళలు అంటున్నారు. మద్యం ధరల వల్ల మగాళ్లు అప్పులపాలు అవుతున్నారని, ఇంటికి కష్టార్జితం చేరడం లేదని ఆవేదన చెందుతున్నారు. నాణ్యతలేని మందు వల్ల ప్రాణాలు పోగొట్టుకుంటూ కుటుంబాలను రోడ్డున పడేస్తున్నారంటూ ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఏపీ మహిళా సమాఖ్యలోని ఓ నాయకురాలు ఆవేదన వ్యక్తం చేస్తూ "కల్తీ మద్యం అమ్మకాల వల్ల పేదల బతుకులు నాశనమవుతున్నాయి. తాము అధికారంలోకి వస్తే మద్య నిషేధం విధిస్తామని చెప్పిన జగన్ ఇచ్చిన హామీని అమలు చేయకపోగా మద్యం అమ్మకాలను ప్రోత్సహిస్తున్నారు. కల్తీ మద్యం వల్ల అనేక మంది చనిపోతున్నారు. కుటుంబాలు రోడ్డున పడుతున్నాయి. ఈ ఎన్నికల్లో వైసీపీ ప్రభుత్వానికి బుద్ధి చెప్పడానికి మహిళలంతా సిద్ధంగా ఉన్నారు" అని స్పష్టం చేశారు. దీనికి కారణం లేకపోలేదనేది నిష్ఠుర సత్యం. జిల్లాలోని ప్రభుత్వ మద్యం దుకాణాలు ఉదయం 10 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకూ అమ్మకాలు సాగించాలి. బార్లు మరో రెండు గంటలు అదనంగా అమ్ముకోవచ్చు. ఈ సమయాలు ప్రభుత్వ ఉత్తర్వులకే పరిమితం అని చెప్పొచ్చు. గ్రామాల్లో ప్రభుత్వ మద్యం షాపుల్లో రాత్రి 10 గంటల వరకూ అమ్ముతున్నారు. సారాయి దుకాణాలు, బెల్టుషాపులకు సమయమంటూ ఏమీ విధించలేదు. ఉదాహరణకు రాజమహేంద్రవరంలో అర్ధరాత్రి ఒంటిగంటకు కూడా మద్యం దొరుకుతుందంటే పూటుగా తాగించడంలో పాలకుల కృషిని కచ్చితంగా తూర్పారబట్టాల్సిందే.

ఫ్యాన్ గాలి వీచడం లేదు..!

- వైసీపీ బీసీ సదస్సులకు స్పందన కరువు
- తాయిలాలతో పార్టీ నాయకుల వల

రాజమహేంద్రవరం, మార్చి 10 (ఆంధ్రజ్యోతి) : వైసీపీ ఆత్మీయ సమావేశాలకు స్పందన కరువవుతోంది. వైసీపీ అధిష్ఠానంపై ప్రజలకు ఉన్న అసంతృప్తి కారణంగా స్థానిక నేతలెవరూ పట్టించుకునే పరిస్థితి కనిపించడంలేదు. సమాజంలోని అన్ని కులాల్లో సంఘ నేతలు, కొందరు చురుకుగా ఉండేవారిని ఏరి వారితో ఆత్మీయ సమావేశాలు పెట్టి, భోజనం ఏర్పాటు చేసి గిఫ్ట్‌లు ఇస్తున్నారు. కానీ వీటికి సాధారణ జనాలు రావడంలేదు. కొవ్వూరు, నిడదవోలు నియోజకవర్గాల పరిధిలో శనివారం రాత్రి జరిగిన బీసీ సదస్సుకు పెద్దగా స్పందన లేదు. కొవ్వూరు పరిధిలోని బీసీల సదస్సు చాగల్లులో ఏర్పాటు చేయగా బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్. కృష్ణయ్య హాజరయ్యారు. అయినా పెద్దగా స్పందన లేదు. పెరవలి మండలం పరిధిలో పరిస్థితి అంతే. రాజమహేంద్రవరం మార్గాని ఎస్టేట్‌లో సిటీ , రూరల్, లోక్‌సభ పరిధి అభ్యర్థులు ఏర్పాటు చేసిన గౌడ శెట్టిబలిజ ఆత్మీయ సమావేశానికి కనీస స్పందన లేదు. సుమారు 4 వేల మంది వస్తారని భోజనం ఏర్పాట్లు, టెంట్లు వేశారు.ఉదయం 9 గంటలకు అని చెప్పినా 12 గంటలకు 100 మంది హాజరు కాలేదు.దీంతో ఇతర బీసీలు, పార్టీ కార్యకర్తలను రప్పిస్తే సుమారు 300 నుంచి 400 మంది హాజరైనట్టు సమాచారం. ఖాళీ కుర్చీలు కనిపించకుండా వేసిన కుర్చీలు తీసేసి, టెంట్లు కూడా సర్దుబాటు చేయడం గమనార్హం. ఇక విలేకరులతో ఆత్మీయ సమావేశాలు జరుగుతున్నాయి. గోపాలపురంలో శనివారం రాత్రి హోంమంత్రి తానేటి వనిత విలేకరులను పరిచయం చేసుకుని విందు ఇచ్చారు.. గిఫ్ట్‌లు పంపిణీ చేశారు. నియోజకవర్గంలో ఎక్కడ పరిస్థితి ఎలా ఉంది.. తాము ఏం చేయాలో సలహాలు చెప్పమని కోరడం గమనార్హం. నలుగురైదుగురు తప్ప ఇంకెవరూ స్పందించలేదు. చివరకు అందరూ సహకరించాలని చెప్పి పంపించడం గమనార్హం. సీతానగరంలో ఏర్పాటు చేసిన మీటింగ్ మహిళలు మద్యంపై గళమెత్తడంతో నిర్వాహకులు ఇబ్బందులు పడ్డారు. అనపర్తిలో ఆశావర్కర్లు, డ్వాక్రామహిళలు, వలంటీర్లతో సమావేశాలు నిర్వహించి, ఓట్లు వేయించవలసిందిగా కోరుతు న్నారు.ఇంతకాలం కార్యకర్తలను పట్టించుకోకపోవడం వల్ల వలంటీర్లు, ప్రభుత్వ ఉద్యోగుల మీదే వైసీపీ ఎక్కువగా ఆధారపడుతోంది.ఉద్యోగుల్లో ప్రభుత్వం పట్ల వ్యతిరేకత ఉన్న సంగతి తెలిసిందే. ఈ వైసీపీ నేతల ఒత్తిడి నుంచి బయట పడేందుకు.. ఎప్పుడు ఎన్నికల షెడ్యూల్ వస్తుందా అని ఉద్యోగులు ఎదురుచూస్తున్నారు.

మహిళకైతే చీర.. పురుషుడికైతే ప్యాంటు, షర్టు



కోరుకొండ, మార్చి 10 : ఎన్నికలు దగ్గర పడుతున్న వేళ అధికార వైసీపీ రాజానగరం నియోజకవర్గంలో గ్రామ స్థాయిలో పని చేసే సిబ్బందికి తాయిలాలతో వల వేస్తోంది. ప్రతి గ్రామంలోను సచివాలయ పరిధిలో పనిచేసే సిబ్బందికి నూతన దుస్తుల సంచులు చేరుతున్నాయి. వలంటీర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశ వర్కర్లకు, ఉపాధి హామీ క్షేత్రస్థాయి సహాయకులు, పారిశుధ్య కార్మికులకు బహుమతుల పేరుతో మహిళలకు చీరలు, పురుషులకు ప్యాంట్, షర్ట్‌లు అందంగా ప్యాక్ చేసి బ్యాగ్‌లో పెట్టి ఇస్తున్నారు. ఈ బ్యాగ్‌పై సీఎం జగన్, ఎమ్మెల్యే జక్కంపూడి రాజా చిత్రాలు ముద్రించారు. గ్రామాల్లో వైసీపీ నాయకులు, ముఖ్య అనుచరుల ఆధ్వర్యంలో బహుమతుల పంపిణీ చురుగ్గా జరుగుతుంది.

ఆత్మీయ సమావేశం పేరిట..తాయిలాలు



దేవరపల్లి, మార్చి 10 : ఎన్నికలు దగ్గర పడడంతో అన్ని వర్గాలకు వైసీపీ నాయకులు, ప్రజాప్రతినిధులు తాయిలాలు అందజేస్తున్నారు. దేవరపల్లి కాకర్ల కల్యాణ మండపంలో ఆదివారం వలంటీర్లు, ఆశావర్కర్లు, అంగ న్వాడీలకు మంత్రి తానేటి వనిత ఆత్మీయ సమావేశం ఏర్పాటు చేశారు. మంత్రి తానేటి వనిత మాట్లాడి వెళ్లిన తరువాత విందు ఇచ్చారు. అనంతరం హాట్‌బాక్స్, ప్లాస్క్ గిఫ్టుల పంపిణీ చేపట్టారు. ఆత్మీయ సమావేశం రసాబాస జరిగింది. పార్టీ పదవుల్లో స్థానికంగా ఉన్న వారికి దేవరపల్లిలో జరిగే కార్యక్రమమైనప్పటికి ప్రాధాన్యత ఇవ్వలేదని ఒకరికొకరు వాగ్వాదం చేసుకున్నారు. దీంతో కొంత సేపు నాయకుల మధ్య రసాబాసగా జరిగింది.

కూటమి విజయం ఖాయం



శంఖారావం సభా వేదికపై టీడీపీ-జనసేన జెండాలతో ఎంపీ రామ్మోహన్‌నాయుడు, ఉమ్మడి అభ్యర్థి ఆదిరెడ్డి వాసు

- ఐదేళ్లు రాజమండ్రిని భ్రష్టు పట్టించిన వైసీపీ
- ఉమ్మడి అభ్యర్థి ఆదిరెడ్డి శ్రీనివాస్‌ని గెలిపించాలి
- ఎన్నికల శంఖారావం సభలో రామ్మోహన్‌నాయుడు

రాజమహేంద్రవరం సిటీ, మార్చి 10 : రాజమహేంద్రవరానికి ఎంతో గొప్ప చరిత్ర ఉంది. ఈ నేలపై కందుకూరి వీరేశలింగపంతులు వంటి మహనీయులు నడయాడారు.అటువంటి నగరాన్ని ఈ ప్రబుద్ధుడు భరత్ రామ్ నేరాల మయంగా మార్చేశాడని శ్రీకాకుళం ఎంపీ కింజరపు రామ్మోహన నాయుడు ధ్వజమెత్తారు. రాజమహేంద్రవరం జెమినీ గ్రౌండ్స్‌లో ఆదివారం రాత్రి జరిగిన టీడీపీ-జనసేన ఎన్నికల శంఖారావం సభ నిర్వహించారు. టీడీపీ వ్యవస్థాపకుడు ఎన్‌టీఆర్ విగ్రహానికి నివాళులర్పించారు. టీడీపీ-జనసేన ఉమ్మడి అభ్యర్థి ఆదిరెడ్డి శ్రీనివాస్ ఎన్నికల శంఖారావం పూరించి సభను ప్రారంభించారు. అనంతరం రామ్మోహననాయుడు మాట్లాడుతూ రాజమహేంద్రవరం నగరానికి ఎంతో చరిత్ర ఉందన్నారు. ఇటువంటి నగరానికి ఐదేళ్లు బూజుపట్టిందన్నారు. రాష్ట్రంలో ఈ వైసీపీ వాళ్లు కేవలం సిద్ధం ఫ్లెక్సీలకే రూ.700 కోట్లు ఖర్చుచేసి పబ్లిసిటీకి అత్యధిక ప్రాధాన్యత ఇచ్చారని చెప్పారు. మీ ఇష్టం వచ్చినట్టు అన్నిగోడలపై ఫ్లెక్సీలు వేసుకోండి ప్రజల గుండెల్లో మాత్రం టీడీపీ-జనసేన ముద్ర వేసుకుందన్నారు. రాజమహేంద్రవరంలో టీడీపీని కొట్టగల దమ్ము ఏ పార్టీకి లేదన్నారు. గత ఎన్నికల్లో మనం నిరూపించామన్నారు. గతంలో 23 మంది టీడీపీ ఎమ్మెల్యేలు గెలిస్తే రాజమహేంద్రవరం నుంచి ఎమ్మెల్యేగా గెలిచిన ఆదిరెడ్డి భవానికి అత్యధిక మెజార్టీ ఇచ్చారని ..ఈ దఫా లక్ష మెజార్టీ రావాలన్నారు. ఎన్నికల కోడ్ నాలుగైదు రోజుల్లో వస్తుందని అప్పుడు అధికారులు కూడా వైసీపీ వాళ్ల మాట వినే పరిస్థితి ఉండదన్నారు. ఆదిరెడ్డి వాసు ఒక కమిట్‌మెంట్‌తో ప్రజలకు సేవ చేసే మనస్తత్వం కలిగిన నాయకుడు అవకాశం ఇస్తే నగరాన్ని అభివృద్ధి చేసి చూపిస్తారన్నారు. చంద్రబాబును ప్రజల్లోకి వెళ్లకుండా జగన్ కుట్రచేసి రాజమహేంద్రవరం సెంట్రల్ జైలులో పెట్టారు. అప్పుడు బాధ్యత గల నాయకుడిగా పవన్ కల్యాణ్ వచ్చి రాష్ట్రంలో పిచ్చికుక్కను తరిమివేయాలని ఇక్కడే పొత్తు ప్రకటించారని గుర్తుచేశారు. జోన్-2 కోఆర్డినేటర్ రంగారావు మాట్లాడుతూ రాష్ట్రాన్ని సర్వనాశనం చేసిన జగన్‌ను ఇంటికి సాగనంపాలన్నారు. టీడీపీ-జనసేన-బీజేపీ కూటమిని ఆదరించి ఆదిరెడ్డి శ్రీనివాస్‌ను గెలిపించాలని పిలుపునిచ్చారు.మాజీ మంత్రి జవహర్ మాట్లాడుతూ ఆదిరెడ్డి శ్రీనివాస్ ఎన్నికల శంఖారావం సభకు వచ్చిన ఈ జనాన్ని చూసి తాడేపల్లి టీవీలు పగులుతాయన్నారు. మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు మాట్లాడుతూ వాసును మనసారా ఆశీర్వదించి అసెంబ్లీకి పంపాలన్నారు.గన్నికృష్ణ మాట్లాడుతూ విజయోత్సవ సభలా ఉందని.. ఆదిరెడ్డి వాసు గెలిచేశాడన్నారు. జనసేన ఇన్‌చార్జి అనుశ్రీ సత్యనారాయణ మాట్లాడుతూ సభ్యత సంస్కారం లేని భరత్‌రామ్‌కు ప్రజలే తగిన గుణపాఠం చెబుతారన్నారు. నాలుగేళ్లగా ఎవరినీ పట్టించుకోని భరత్ ఇప్పుడు కేవలం ఓట్ల కోసం చీరలు పంచుతున్నాడన్నారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కాశి నవీన్ కుమార్ మాట్లాడుతూ చంద్రబాబు సీఎం కావాలి.. ఆదిరెడ్డి వాసు గెలవాలి.. జగన్‌ను ఇంటికి పంపించాలన్నారు.ఉమ్మడి అభ్యర్థి ఆదిరెడ్డి శ్రీనివాస్ మాట్లాడుతూ రాజమహేంద్రవరం బిడ్డగా మీకు హామీ ఇస్తున్నా రాజమహేంద్రరంలో బ్లేడ్ బ్యాచ్‌లను నియంత్రిస్తా, నగరాన్ని పూర్తి స్థాయిలో అభివృద్ధి చేస్తానన్నారు. మీ ఆశీర్వాదంతో తనను గెలిపించాలన్నారు. సాంస్కృతిక రాజధాని రాజమహేంద్రవరానికి భరత్ రామ్ అపకీర్తిని తీసుకువచ్చాడన్నారు. ఈ సభలో టీడీపీ రాష్ట్ర శెట్టిబలిజ సాధికార సమితి రాష్ట్ర కన్వీనర్ కుడుపూడి సత్తిబాబు, టీఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వర్రే శ్రీనివాసరావు,టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వాసిరెడ్డి రాంబాబు, టీడీపీ నగర ఉపాధ్యక్షుడు ఉప్పులూరి జానకిరామయ్య, మజ్జి రాంబాబు, దాస్యం ప్రసాద్, బుడ్డిగ రాధా, కొయ్యల రమణ, మరుకుర్తి రవియాద్, చాపల చిన్నరాజు, బట్టంకి ప్రకాష్, తురకల నిర్మల, మాలే విజయలక్ష్మి, కోసూరి చండీప్రియ, కప్పల వెలుగుకుమారి,జనసేన నాయకులు గంటా స్వరూప, ప్రియా సౌజన్య పాల్గొన్నారు.



ఎన్నికల శంఖారావం సభకు భారీగా హాజరైన పట్టణ ప్రజలు

తూర్పుగోదావరి

• రాజమహేంద్రవరం సిటీ/ రూరల్ • రాజానగరం • అనపర్తి • కొవ్వూరు • నిడదవోలు • గోపాలపురం

సంస్కృత పాఠశాల శివాలయంలో పూర్ణాహుతి



శివాలయంలో పూర్ణాహుతి నిర్వహిస్తున్న పండితులు

కొవ్వూరు, మార్చి 10: కొవ్వూరు సంస్కృత పాఠశాల ప్రాంగణంలోని గోష్పదేశ్వరస్వామి ఆలయంలో మహాశివరాత్రి ఉత్సవాలు 5వ రోజుకు చేరుకున్నాయి. ఆదివారం ఆలయార్చకులు పూర్ణాహుతి, అవబృదం, త్రిశూలస్నానం, నీరాజనం జరిపారు. శ్రీ కళాభారతి బుర్రకథ బృందం శ్రీకృష్ణ రాయబారం బురకథ నిర్వహించింది. అనంతరం భక్తులకు భారీ అన్న సమారాధన చేపట్టారు. రాత్రి స్వామికి పవళింపు సేవ జరిపారు. కార్యక్రమంలో పరిమి గెరటయ్య, మల్లిన గోపి, పేరిచర్ల బోసురాజు, కిషోర్, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు. గోష్పదక్షేత్రంలోని సుందరేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం రాత్రి స్వామివారికి పవళింపు సేవ నిర్వహించారు. భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

హిందూ ధర్మాన్ని పరిరక్షించుకోవాలి

రాష్ట్రీయ స్వయం సేవక్ విభాగ కార్యావహ సుబ్బారావు

కొవ్వూరు, మార్చి 10: సమాజంలో ఎదురయ్యే సమస్యలను ఎదుర్కొని హిందూ ధర్మాన్ని పరిరక్షించుకోవాలని రాష్ట్రీయ స్వయం సేవక్ (ఆర్ఎస్ఎస్) విభాగ కార్యావహ వడ్డాది సుబ్బారావు అన్నారు. కొవ్వూరు శ్రీరామానంద గౌడీయమఠం ప్రాంగణంలో ఆదివారం ఆర్ఎస్ఎస్ ఆధ్వర్యంలో సద్భావన సదస్సును ఖండ సంఘచాలక్ దోర్బల ప్రభాకరశర్మ అధ్యక్షతన నిర్వహించారు. సమన్వయ కర్తగా పాల్గొన్న సుబ్బారావు మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో హిందూ సమాజం ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించారు. సంఘటితంగా అనుసరించవలసిన విధానాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో గోవర్ధనం శ్రీనివాస మూర్తి, టీఎస్వీ రమణమూర్తి, పిల్లలమర్రి మురళీకృష్ణ, జీబీవీ సుబ్రహ్మణ్యం, గుడివాక శ్రీనివాస్, షైపాల రాంబాబు పాల్గొన్నారు.

రామ మందిరంలో వేదసభ



వేదసభ నిర్వహిస్తున్న ఘనాపాఠీలు

కొవ్వూరు, మార్చి 10: కొవ్వూరులోని పురుషోత్తమ రామ మందిరంలో ఆదివారం శంకరాచార్య వేదశాస్త్ర పరిషత్ కార్యదర్శి మేడూరి శ్రీనివాస్ ఆధ్వర్యంలో వేదసభ నిర్వహించారు. మేడూరి సుబ్బన్న స్థాపించిన వైదశాస్త్ర పరిషత్ ఆధ్వర్యంలో ఇప్పటివరకు 25 వేదసభలు నిర్వహించామన్నారు. సభ అనంతరం పండితులు, ఘనాపాఠీలను సత్కరించారు. కార్యక్రమంలో నోరి బోగేశ్వరశర్మ, దోర్బల ప్రభాకరశర్మ, శ్రీపాద మాణిక్య అవధాని, తుట్టగుంట భైరవమూర్తి పాల్గొన్నారు. అలాగే పాతవూరులోని శ్రీఉమా చోడేశ్వరస్వామి దేవస్థానంలో వేద సభ నిర్వహించారు. సభ అనంతరం ఘనాపాఠీలు, క్రమాపాఠీలు, స్మార్తులను సత్కరించారు. కార్యక్రమంలో ఏలూరిపాటి నాగేశ్వరరావు, ఎల్లాప్రగడ రమేష్, దేవరకొండ సాయిప్రసాద్, గండికోట పవన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆంజనేయులుకు డైమండ్ అవార్డు



నిడదవోలు, మార్చి 10: రోటరీ క్లబ్ ఆఫ్ నిడదవోలు అధ్యక్షుడు కీర్తి ఆంజనేయులును ఆదివారం రోటరీ ఇంటర్నేషనల్ పాలకొల్లులో నిర్వహించిన సంరక్షణ పోలియో సెమినార్‌లో డైమండ్ అవార్డుతో సత్కరించారు. ఆంజనేయులు పోలియో నిర్మూలనకు కార్యక్రమాలు, విరాళాలు సేకరించడంలో చేసిన కృషికి రోటరీ గవర్నర్ రావూరి సుబ్బారావు, పూర్వ గవర్నర్ భరత్‌కుమార్‌రెడ్డి చేతుల మీదుగా డైమండ్ అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా ఆంజనేయులును మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ, పోలదాసు శ్రీనివాస్, గొన్నాబత్తు రామారావు, గోపిరెడ్డి శ్రీనివాస్, ఖండవల్లి రంగాచార్యులు తదితరులు అభినందించారు.

దుర్గామల్లేశ్వరుడికి ప్రత్యేక పూజలు

దేవరపల్లి, మార్చి 10: మండలంలోని పల్లంట్లలో శివరాత్రి ఉత్సవాల్లో భాగంగా దుర్గామల్లేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయార్చకులు పల్లకీసేవా, పుష్పయోగం జరిపారు. ఆలయ కమిటీ సభ్యుడు బలుసు సత్యనారాయణ, విజయలక్ష్మి దంపతులు పూజలు, హోమాలు చేపట్టారు. అనంతరం నిర్వహించిన భారీ అన్నసమారాధనలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు, ఆలయ కమిటీ సభ్యులు సతీష్, శివరామప్రసాద్, ఎం.శ్రీనివాసరావు, కొయ్యలమూడి వేణుగోపాలకృష్ణ, గన్నమని సత్యప్రసాద్, కొయ్యలమూడి కాశి, వల్లభనేని గాంధీప్రసాద్ పాల్గొన్నారు.

ఓటర్లు నిర్భయంగా ఓటేయండి : డీఎస్పీ



దేవరపల్లిలో సాయుధ బలగాలతో కవాతు నిర్వహిస్తున్న పోలీసులు

దేవరపల్లి, మార్చి 10: రాబోయే లోక్‌సభ, ఆసెంబ్లీ ఎన్నికల్లో ఓటర్లు నిర్భయంగా ఓటు వేసేందుకు గ్రామాల్లో ప్రశాంత వాతావరణం నెలకొల్పేందుకు ఈ కవాతు నిర్వహించటం జరిగిందని డీఎస్పీ కేసీహెచ్ రామారావు అన్నారు. దేవరపల్లిలో పోలీసు కవాతు స్థానిక పోలీస్‌స్టేషన్ నుంచి చైతన్య స్కూల్ వరకు నిర్వహించారు. డీఎస్పీ మాట్లాడుతూ సమస్యాత్మక గ్రామాలు గుర్తించి శాంతి భద్రతలు కాపాడేందుకు ప్రత్యేక పోలీస్ బెటాలియన్ ఏర్పాటు చేశారని, మండలంలోని 22 గ్రామాల్లోనూ ప్రజలు ప్రశాంతంగా ఓటు నూరుశాతం వేసే విధంగా చూస్తామన్నారు. కవాతు మండలంలోని యాదవోలు, త్యాజంపూడి గ్రామాల్లో నిర్వహిస్తున్నామని, కొవ్వూరు, నిడదవోలు, గోపాలపురం నియోజకవర్గాల్లోని ప్రధాన గ్రామాల్లో సీఎస్ఎఫ్ జవాన్లు, పోలీసు సిబ్బందితో నిర్వహించామన్నారు. కార్యక్రమంలో సీఐ పీ.బాలసురేష్, ఎస్ఐ కె.శ్రీహరిరావు, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పదో తరగతి పరీక్ష పేపర్లు వచ్చేశాయ్..



పేపర్ బండిళ్లకు సంబంధించి నివేదిక పరిశీలిస్తున్న అధికారులు

నల్లజర్ల, మార్చి 10: ఈ నెల 18 నుంచి 30వ తేదీ వరకు జరిగే పదో తరగతి పరీక్షలకు సంబంధించి సెట్-1 పరీక్ష పేపర్లు నల్లజర్ల పోలీస్‌స్టేషన్‌కు చేరాయి. కడియం ఎంఈవో కిరణ్‌కుమార్ పోలీస్ బందోబస్తీతో పరీక్ష పత్రాలను తీసుకొచ్చారు. నల్లజర్ల కాస్టోడియన్స్ ఎంఈవో సత్యనారాయణ, హెచ్ఎం కోమలి చిత్ర పరీక్ష పత్రాలను స్వాధీనం చేసుకుని సీల్ వేసి పోలీస్‌స్టేషన్‌లోని స్ట్రాంగ్ రూంలో భద్రపర్చారు. సోమవారం సెట్-2 పరీక్ష పత్రాలు వస్తాయని, ఈ ఏడాది 1348మంది విద్యార్థులు పదో తరగతి పరీక్ష రాయనున్నట్టు కస్టోడియన్ అధికారులు తెలిపారు.

సూర్యనారాయణుడి శాంతి కల్యాణం

తాళ్లపూడి, మార్చి 10: మండలంలోని ప్రక్కిలంక గ్రామంలో విశ్వేశ్వరస్వామి ఆలయంలో మాఘమాసం సందర్భంగా 30 రోజులుగా నిర్వహిస్తున్న సౌరయాగం, సూర్యనమస్కారాలు ఆదివారం ఏర్పాటు చేసిన ఉషాఛాయా సమేత సూర్యనారాయణమూర్తి శాంతి కల్యాణంతో ముగిసాయి. కౌతారపు విశ్వనాథ శర్మ ఆధ్వర్యంలో వేద పండితులు జరిపించిన ఈ కల్యాణోత్సవాన్ని అధిక సంఖ్యలో భక్తులు తిలకించారు. కల్యాణం అనంతరం అన్న సమారాధన నిర్వహించారు.

ఒప్పంద అధ్యాపకుల సమస్యలు పరిష్కరించండి

▸▸ హోం మంత్రి తానేటి వనితకు వినతి



హోంమంత్రికి వినతిపత్రం అందిస్తున్న ఒప్పంద అధ్యాపకులు

గోపాలపురం, మార్చి 10: రాష్ట్రంలో వివిధ ప్రభుత్వ కళాశాలల్లో పని చేస్తున్న ఒప్పంద అధ్యాపకుల సమస్యలను పరిష్కరించాలని ఆ సంఘం నాయకులు హోం మంత్రి తానేటి వనితకు ఆదివారం వినతిపత్రం అందజేశారు. ఒప్పంద అధ్యాపకులు మంత్రి వనితతో మాట్లాడుతూ తాము రెండున్నర దశాబ్దాలుగా ప్రభుత్వ కళాశాలలో ఒప్పంద అధ్యాపకులుగా పని చేస్తున్నట్లు తెలిపారు. నాటి నుంచి నేటి వరకు ఎన్నో ప్రభుత్వాలు మారిన చాలీచాలని జీతాలతో కాలం గడుపుతున్నామని ఆవేదన వ్యక్తంచేశారు. అయితే తమ సమస్యలను సీఎం జగన్ దృష్టికి తీసుకెళ్లగా ఆయన స్పందించినట్టు తెలిపారు. రాష్ట్రంలో వివిధ శాఖల్లో పనిచేస్తున్న ఒప్పంద అధ్యాపకులను రెగ్యూలర్ చేస్తానని హామీ ఇచ్చారని, హామీల్లో భాగంగా వైద్య, ఆరోగ్య శాఖలో కొంత మందిని రెగ్యూలర్ చేశారన్నారు. అయితే విద్యాశాఖలో పనిచేస్తున్న ఒప్పంద అధ్యాపకుల విషయంలో మాత్రం జాప్యం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం జీవో విడదల చేసి నెలలు గడుస్తున్నా రెగ్యులరైజేషన్‌కు సంబంధించిన ప్రక్రియ మాత్రం కార్యరూపం దాల్చలేదని మంత్రి వద్ద వాపోయారు. అధికారులకు తమకు సంబంధించిన వ్యక్తిగత వివరాలు అందజేసినప్పటికీ వివిధ కారణాలతో ఒప్పంద అధ్యాపకులు పర్మినెంట్ చేయడానికి ఆటంకాలు కలిగిస్తున్నారని అన్నారు. దీని పై స్పందించిన మంత్రి వనిత.. సమస్యను ముఖ్యమంత్రి, విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. మండలంలోని వేళ్లచింతలగూడెంలో ఆర్‌బీకేను ప్రారంభించారు. అనంతరం వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆవరణలో వైఎస్సార్ చేయూత నాలుగో విడత కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఒప్పంద అధ్యాపకులు పాతూరి శ్రీదేవి, నీలి సత్యనారాయణ, పాముల తిరుపతయ్య, రాజు పాల్గొన్నారు.

ఓటు హక్కును సక్రమంగా వినియోగించుకోండి

▸▸ ఎస్సీ కమిషన్ రాష్ట్ర చైర్మన్ విక్టర్ ప్రసాద్



సమావేశంలో మాట్లాడుతున్న విక్టర్ ప్రసాద్

తాళ్లపూడి, మార్చి 10: ఓటు హక్కును వివియోగించుకుని పాలకులుగా మారతారా? ఓటు హక్కును అమ్ముకుని బానిసలుగా మారతారా అని ఎస్సీ కమిషన్ రాష్ట్ర చైర్మన్ విక్టర్ ప్రసాద్ యువతను ప్రశ్నించారు. ఆదివారం ఆయన మండలంలోని వేగేశ్వరపురం, బల్లిపాడు, ప్రక్కిలంక, తాళ్లపూడి గ్రామాల్లో పర్యటించి అంబేడ్కర్, జగ్జీవన్‌రామ్ విగ్రహాలకు నివాళులర్పించారు. వేగేశ్వరపురంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ యువత చక్కగా చదువుకోవాలని, గొడవలకు, జూదం, మద్యం జోలికి వెళ్లొద్దని, సమాజంలో హుందాగా వ్యవహరించాలన్నారు. అంబేడ్కర్ రాజ్యాంగాన్ని రచించి, సమాజంలో కుల, మత, ప్రాంత, వర్గాలకు అతీతంగా అందరికీ ఎన్నో హక్కులు కల్పించారని, అయితే అంబేడ్కర్‌ను ఒక కుల నాయకుడిగా మార్చేశారన్నారు. ఆయన ఆశయాలకు అనుగుణంగా అందరూ తమ ప్రవర్తన మార్చుకోవాలని, ఓటు హక్కును సక్రమంగా వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో జైభీమ్ రాష్ట్ర అధ్యక్షుడు భానుచందర్, గూడా విజయరాజు, కరిపోతు అశోక్, యాళ్ల సునీల్, కంభం శివయ్య, కాపూరి భీమరాజు, ఊబరవి పాల్గొన్నారు.

మంత్రి సభకు జనాలు అరకొర

▸▸ కుర్చీలను మడత పెట్టేసిన పంచాయతీ సిబ్బంది

▸▸ హుకుంపేటలో 'చేయూత' పంపిణీ సభ



సభా ప్రాంగణంలో ఖాళీగా కనిపిస్తున్న కుర్చీలు

రాజమహేంద్రవరం రూరల్, మార్చి10: అయితే ప్రభుత్వంపై నమ్మకం సన్నగిల్లిందో లేక తీవ్ర వ్యతిరేకతో తెలియదుగాని మంచినీళ్లు, స్నాక్స్, బస్సులు వంటివి ఏర్పాటు చేసినా కార్యక్రమాలకు ప్రజలు హాజరు కావడం లేదు. మొదటి మీటింగ్‌కు ఫుల్‌గా వచ్చారు, రెండో సారి మీటింగ్‌కు తగ్గారు.. ఆదివారం రాజమహేంద్రవరం రూరల్ మండలం హుకుంపేట పరిధిలోని నేషనల్ హైవే ఆనుకొని డీమార్టు పక్కనున్న ఖాళీ స్థలంలో ప్రభుత్వ పథకాల పంపిణీ కార్యక్రమం ఏర్పాటు చేశారు. మంత్రి వేణుగోపాలకృష్ణ నియోజకవర్గ వైసీపీ కోఆర్డినేటర్‌గా వచ్చినప్పటి నుంచి పించన్ల పంపిణీ, డ్వాక్రా మహిళల సున్నావడ్డీ, ఆదివారం చేయూత పంపిణీ కార్యక్రమాలు చేపట్టారు. అయితే చేయూత పంపిణీ కార్యక్రమానికి ఆరు వేలు జనసమీకరణ చేయాలని, వాటికి అనుగుణంగా ఏర్పాట్లు చేయాలంటూ అధికారులకు మౌఖిక ఆదేశాలు జారీ చేసినట్టు తెలిసింది. అయితే వారు అనుకున్న దానికంటే సగం మంది కూడా హాజరు కాకపోవడంతో మంత్రి అవాక్కయ్యారు. దీంతో ఖాళీగా వున్న కుర్చీలను మడత పెట్టాలంటూ చెప్పడంతో పంచాయతీ కార్మికులతో కుర్చీలను ఎత్తివేయించారు. మరోక విషయం ఏమిటంటే ప్రతి సమావేశానికి బస్సులు పంపించే పాఠశాలల యాజమాన్యం కూడా బస్సులను పంపించ లేమంటూ చేతులెత్తేస్తోందని కొంతమంది అధికారులు చెవులు కొరుక్కొంటున్నారు. ఇదిలా ఉండగా ఈ నెల 7న ముఖ్యమంత్రి చేయూత బటన్ నొక్కారు. అదివారం (మార్చి 10) రూరల్ మండలం పరిధిలో చేయూత చెక్కును పంపిణీ చేయడం ఏమిటంటూ, కార్యక్రమాల నిర్వహణ పేరుతో పార్టీ ప్రచారాలు చేసుకుంటూ పంచాయతీ, మండల పరిషత్ నిధులను దుర్వినియోగం చేస్తున్నారంటూ పలు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

జగన్‌ను నమ్మి మోసపోవద్దు : నెహ్రూ



గోకవరం: కృష్ణుడిపాలెంలో టీడీపీలో చేరిన కార్యకర్తలతో జ్యోతుల నెహ్రూ

గోకవరం, మార్చి 10: అమలు కాని హామీలతో ముఖ్యమంత్రి పీఠాన్ని దక్కించుకున్న జగన్‌ను మరోమారు నమ్మి మోసపోవద్దని జగ్గంపేట మాజీ ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ అన్నారు. మండలంలోని కృష్ణునిపాలెం పంచాయతీ పరిధిలోని వెంకటాపురం, రామన్నపాలెం గ్రామాల్లో వైసీపీ నుంచి ఎస్సీ, బీసీలకు చెందిన సుమారు 100 కుటుంబాల వారు ఆదివారం టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సభలో ఆయన మాట్లాడుతూ గడిచిన ఐదేళ్లలో ఎస్సీ, బీసీలకు వైసీపీ ప్రభుత్వం చేసేందేమి లేదన్నారు. అన్ని కులాలకు సంపూర్ణ న్యాయం జరగాలంటే టీడీపీ, జనసేన, బీజేపీ సంకీర్ణ ప్రభుత్వం అధికారంలోకి రావాలన్నారు. అనంతరం రామన్నపాలెం గ్రామానికి చెందిన జనసేన మండల ఉపాధ్యక్షుడు దుర్గాప్రసాద్‌ను కలిసి తనకు సంపూర్ణ మద్దతు ప్రకటించాలని నెహ్రూ కోరారు. టీడీపీ-జనసేన పొత్తు ధర్మంలో భాగంగా టీడీపీ విజయానికి కృషి చేస్తానని దుర్గాప్రసాద్ హామీ ఇచ్చారు.

రాబోయేది టీడీపీ-జనసేన-బీజేపీ ప్రభుత్వమే : రామకృష్ణారెడ్డి



రంగంపేట: కేవీ పాలెంలో టీడీపీలోకి ఆహ్వానిస్తున్న రామకృష్ణారెడ్డి

రంగంపేట, మార్చి 10: రాబోయే రెండు నెలల్లో టీడీపీ-జనసేన-బీజేపీ ప్రభుత్వమే అధికారంలోకి వస్తుందని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని కొత్త వీరంపాలెంలో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రజలకు ఇచ్చిన పట్టాలను ఎవరూ వెనక్కి తీసుకోరని, రెండు నెలల్లో టీడీపీ అధికారంలోకి వచ్చి.. దమ్మీ ఇంటి పట్టాలు పంపిణీ చేసినది అధికారులైనా, ప్రజాప్రతినిధులైనా వదిలిపెట్టేది లేదని, అందరిపైనా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆమడదూరం పోయిన అభివృద్ధిని మళ్లీ పట్టాలెక్కించి అభివృద్ధి, సంక్షేమాన్ని సమాంతరంగా అమలు చేస్తామన్నారు. రంగంపేట మండలంలో స్థానిక ఎమ్మెల్యే గెలుపునకు ఎంతో కష్టపడి పనిచేసిన వైసీపీ నాయకులను ఇప్పుడు పట్టించుకుపోవడం దారుణమన్నారు. అనంతరం వైసీపీ నాయకులు మత్సా వెంకటగోపాలం,(చంటిబాబు), మత్సా వీరబాబు, ఉద్దండ్రావు సత్యనారాయణతోపాటు మరో 15 కుటుంబాలు టీడీపీ చేరాయి. వారికి రామకృష్ణారెడ్డి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆళ్ళ గోవింద్, పూసల శ్రీను, ఉద్దండ్రావు శ్రీను, ఉండవిల్లి గిరిబాబు తదితరులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా రామకృష్ణారెడ్డి సతీమణి మహాలక్ష్మి పాతవీరంపాలెంలో పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి సూపర్‌సిక్స్ పథకాల ద్వారా పొందే లబ్ధిని వివరించి కరపత్రాలను పంపిణీ చేశారు. రాబోయే ఎన్నికల్లో టీడీపీకి ఓటువేసి గెలిపించాలని కోరారు.

టీడీపీ సీటు శేషారావుకు కేటాయించాలి

కాల్దరిలో నాయకులు, కార్యకర్తల కొవ్వొత్తుల ర్యాలీ

ఉండ్రాజవరం, మార్చి 10: నిడదవోలు టీడీపీ ఎమ్మెల్యే సీటును బూరుగుపల్లి శేషారావుకు కేటాయించాలని మండలంలోని కాల్దారి గ్రామంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఆదివారం రాత్రి కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. స్థానిక ఎన్‌టీఆర్ విగ్రహం వద్ద పూలమాలలతో నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ గెలిచే వ్యక్తి ప్రజాభిమానం పొందిన వ్యక్తి శేషారావుకే టీడీపీ-జనసేన నాయకత్వం సీటు కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ నిడదవోలు, ఉండ్రాజవరం అధ్యక్షులు కొమ్మిన వెంకటేశ్వరావు, సింహాద్రి రామకృష్ణ, నాయకులు రాచమళ్ళ శ్రీనివాస్, ఈర్పిన సత్యనారాయణ పాల్గొన్నారు.

డ్రగ్ ట్రేడ్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శిగా గణపతి



తాళ్లపూడి, మార్చి 10: డ్రగ్‌ట్రేడ్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శిగా పిండి గణపతి ఎన్నికయ్యారు. రాజమహేంద్రవరం ఛాంబర్ ఆఫ్ కామర్స్ భవనంలో జరిగిన జిల్లా డ్రగ్‌ట్రేడ్ అసోసియేషన్ ఎన్నికల్లో తాళ్లపూడిలో దొరశ్రీ మెడికల్ పిండి గణపతి జిల్లా కార్యదర్శిగా ఎన్నికయ్యారు. 2024-2027కు గానూ జరిగిన ఈ ఎన్నికల్లో జిల్లాలోని 19 మండలాల హోల్‌సేల్, రిటైల్ కెమిస్టులు పాల్గొన్నారని తెలిపారు. ఎన్నికలు 30 ఏళ్లుగా ఏకగ్రీవంగా కొనసాగగా ఈ ఏడాది ఎన్నికలు జరిగాయని, జిల్లా అధ్యక్షుడిగా రాయిపూడి శ్రీనివాసరావు ఎన్నికయ్యారని గణపతి తెలిపారు.

10 బీరు సీసాలు స్వాధీనం

కొవ్వూరు, మార్చి 10: కొవ్వూరులో అనధికారికంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకున్నట్టు సీఐ వి.జగదీశ్వరరావు తెలిపారు. ఆదివారం స్థానిక రోడ్డు కం రైలు బ్రిడ్జి టోల్‌గేట్ సెంటర్‌లో నడిపల్లి సత్యనారాయణను అరెస్టు చేసి, 10 బీరు సీసాలు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్టు సీఐ పేర్కొన్నారు.

కోట సత్తెమ్మకు విశేష పూజలు



నిడదవోలు, మార్చి 10: మండలంలోని తిమ్మరాజుపాలెంలో కోట సత్తెమ్మ ఆలయంలో ఆదివారం విశేష పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి ధూపహారతి, నిత్యార్చనా, లలితా పారాయణం, సహస్రనామ కుంకుమ పూజలు జరిపారు. అనంతరం క్షీర, మహానివేదన చేశారు. పలు ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో ఆలయం కిటకిటలాడింది. ప్రత్యేక అలంకరణలో ఉన్న అమ్మవారిని భక్తులు పెద్ద ఎత్తున దర్శించుకున్నారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా అమ్మవారి దర్శనం కలుగజేశారు. సత్తెమ్మ తల్లికి ప్రత్యేక దర్శనం, అన్నదాన విరాళాలు, ప్రసాద విక్రయాలు, పూజా టికెట్లు ద్వారా రూ.1,27,975 ఆదాయం లభించినట్టు ఆలయ సహాయ కమిషనర్, కార్య నిర్వహణాధికారి వి.హరి సూర్యప్రకాష్ తెలిపారు.

టీడీపీ శంఖారావం సభకు భారీ ఊరేగింపు



రాజమహేంద్రవరం సిటీ, మార్చి 10: రాజమహేంద్రవరంలో టీడీపీ-జనసేన అభ్యర్థి ఆదిరెడ్డి శ్రీనివాస్ నిర్వహించిన ఎన్నికల శంఖారావం సభకు భారీగా ప్రజలు తరలివచ్చారు. వేలాది మంది రాజమహేంద్రవరంలో ఆర్‌కాంప్లెక్స్ రోడ్డు, తిలక్ రోడ్డు, మోరంపూడి రోడ్డుల గుండా వాహనాలలో రావడంతో ఆ ప్రాంత మంది ప్రజలతో నిండిపోయింది. రాజమండ్రి పుష్కరాల రేవు నుంచి ఆదిరెడ్డి వాసు, శ్రీకాకుళం ఎంపీ కింజరపు రామోహ్మానాయుడు లు కలిసి వాహనంలో సుమారు వెయ్యి మంది కార్యకర్తలతో ముందు బైక్‌లతో మోరంపూడి వరకు ఊరేగింపు నిర్వహించారు. సాయంత్ర 6:30 గంటలకు మోరంపూడి జెమిని గ్రౌండ్స్‌కు చేరుకున్నారు.

దిష్టి బొమ్మ దహనం విష సంస్కృతి

టీడీపీ కడియం అధ్యక్షుడు వెలుగుబంటి నాని



కడియంలో ఎమ్మెల్యే గోరంట్ల చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న దృశ్యం

కడియం, మార్చి 10: దిష్టిబొమ్మ దహనం విషసంస్కృతికి చిహ్నమని, అలాంటి బేషజాలు బీసీ వర్గాల విభజనకు దారి తీసే విధంగా మంత్రి చెల్లుబోయిన వేణు చర్యలు ఉన్నాయని టీడీపీ మండలాధ్యక్షుడు వెలుగుబంటి రఘురామ్(నాని) అన్నారు. ఆదివారం ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి చిత్రపటంతో ఎంపీపీ వెలుగుబంటి ప్రసాద్ కార్యాలయం నుంచి పాదయాత్రగా దేవీచౌక్ సెంటర్ వరకు వెళ్లి చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా టీడీపీ రాష్ట్ర రైతు ఉపాధ్యక్షుడు మార్గాని సత్యనారాయణ, చెల్లుబోయిన శ్రీనివాస్, పితాని శివరామకృష్ణ, ముత్రాబత్తుల విజయ, యనమదల రాజు మాట్లాడుతూ రామచంద్రపురంలో మంత్రిగా వేణు చేసిన అభివృద్ధి ప్రజలకు తెలుసని, అక్కడ ఏమి లేదు కాబట్టే ఇక్కడకు పంపారని ఎద్దేవా చేశారు. మహిళలు దిష్టిబొమ్మను దహనం చేసిన ప్రాంతాన్ని పాలతో సంప్రోక్షణ చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు అన్నందేవుల చంటి, బోడపాటి గోపి, వాసంశెట్టి నాగబాబు, జల్లి కృపారావు, గుత్రపు సత్యనారాయణ పాల్గొన్నారు.

దేశానికి జవాన్, కిసాన్ పాలనకావాలి

భారతీయ జవాన్ కిసాన్ పార్టీ నేషనల్ కోఆర్డినేటర్ మోహనరావు

రాజమహేంద్రవరం సిటీ, మార్చి 10: దేశం కోసం ప్రాణాలర్పించే జవాన్, ప్రజలకు తిండిపెట్టే కిసాన్‌ల పాలన కావాలని భారతీయ జవాన్ కిసాన్ పార్టీ నేషనల్ కోఆర్డినేటర్ సుదరి మోహనరావు అన్నారు. రాజమండ్రి ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం ఆయన మాట్లాడారు. శక్తివంతమైన పాలన జవాన్ కిసాన్‌ల వల్లనే సాధమవుతుందన్నారు. విద్య, వైద్యం, సమాంతర న్యాయం మూడు అంశాలనే తమ ఎన్నికల మెనిఫెస్టోలో ప్రధాన అంశాలుగా చేర్చి ఎన్నికలకు సిద్ధమవుతున్నామన్నారు. దేశంలో అసెంబ్లీ నియోజకవర్గాల్లో తాము పోటీ చేయడంలేదని అన్ని పార్లమెంట్ స్థానాల్లో పోటీ చేస్తామని చెప్పారు. ప్రజాస్వామ్యంలో మాజీ సైనిక ఉద్యోగులంతా పాలుపంచుకోవాలని ఈ పార్టీని స్థాపించామన్నారు. రాజమండ్రి పార్లమెంట్ అభ్యర్థిగా బంగారు కృష్ణమూర్తిని పోటీకి నిలబెడుతున్నామన్నారు. సమావేశంలో పార్టీ న్యాయసలహాదారులు అబ్దుల్ సలామ్, రాష్ట్ర కార్యదర్శి శివప్రసాద్ కుమార్, టి.రామ్‌కుమార్(ప్రొద్దుటూరు), నెల్లూరి సుషిత (కడప), రమణస్వామి, రాజేశ్వరరావు, తెలంగాణ నాయకుడు యోగేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

చదువుల తల్లి సావిత్రిబాయి పూలే

రాజమహేంద్రవరం సిటీ, మార్చి 10: సావిత్రిబాయి పూలే 193 ఏళ్ళ క్రితం పుట్టి ఒక సంఘసంస్కర్తగా అవతరించి మహిళలు పురుషులతో సమానంగా బతికే హక్కు సాధించాలని పెద్ద పోరాటం చేసి చదువుల తల్లిగా నిలిచారని ఎస్సీ ఎస్టీ రాష్ట్ర సంక్షేమ సంఘం అధ్యక్షుడు కోరుకొండ చిరంజీవి అన్నారు.రాజమహేంద్రవరం గణేష్ చౌక్‌లోని వెనుకబడి తరగతుల కళాశాల వసతి గృహంలో ఆదివారం సావిత్రి బాయి పూలే 127వ వర్ధంతిని నిర్వహించారు.ఆమె విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎస్సీ రైట్స్ ప్రొటెక్షన్ రాష్ట్ర అధ్యక్షుడు తాళ్ళూరి బాబు రాజేంద్రప్రసాద్, ధారా ఏసురత్నం, డీఎల్ఎస్ఏ సభ్యులు పాము బాబూరావు, వసతిగృహఆధికారి ముమ్మిడిసత్యకుమారి పాల్గొన్నారు.

సమాజానికి సాహిత్యం అవసరం

రాజమహేంద్రవరం అర్బన్, మార్చి 10: సాహిత్యం లేకపోతే మానవ మనుగడలో సంతోషం ఉండదని, సమాజానికి సాహిత్యం అవసరం ఉందని కళాగౌతమి వ్యవస్థాపకుడు బీవీఎస్ మూర్తి అన్నారు. కందుకూరి వీరేశలింగం నాటక సమాజం ప్రాంగణంలో కళాగౌతమి ప్రతి రెండో ఆదివారం నిర్వహించే రచయితల సమావేశంలో ఎంవీ రమేష్ రచించిన జానకి రాముల జీవన యానం అనే పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో రిటైర్డు ప్రిన్సిపాల్ అద్దేపల్లి సుగుణ, కళాగౌతమి అధ్యక్షుడు పీవీబీ సంజీవరావు ,చాగంటి మాలతి, కళాగౌతమి కార్యదర్శి రమాదేవి, వీవీ సుబ్రహ్మణ్యం, సప్పా దుర్గాప్రసాద్, ఏ కోదండరావు పాల్గొన్నారు.

ముగిసిన మాఘమాస ఉత్సవాలు

కోరుకొండ, మార్చి 10: మాఘమాసం ముగింపు సందర్భంగా కోరుకొండ హరేరామ సమాజం వద్ద సూర్యనారాయణమూర్తి ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహించారు. ఈ సందర్భంగా విష్ణు సహస్ర నామం, ఆదిత్య హృదయం, సూర్యఅష్టకం, సూర్యశోస్త్రం, సూర్య అష్టోత్తర శతనామావళి పారాయణం చేశారు. అర్చకులు స్వామి వారికి ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు జరిపారు. కార్యక్రమంలో హరేరామ సమాజ మహిళా బృందం కొటికలపూడి లక్ష్మీకాంతం, నాగ శిరోమణి, చేర్ల రాజ్యలక్ష్మీ, సత్యవతి, సునీత, పద్మ, సుమారు 100 మంది మహిళలు పాల్గొన్నారు. స్థానిక అపర్ణ ఏజెన్సీ వీరందరికీ రవికలు అందజేసింది.

వాహనం ఢీకొని వ్యక్తి మృతి



మృతుడు శ్రీనివాస్

గోకవరం, మార్చి 10: గుర్తు తెలియని వాహనం ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన ఆదివారం రాత్రి గోకవరంలో జరిగింది. గోకవరంలోని అచ్చియ్యపేటకు చెందిన రాజాని శ్రీనివాస్(40) మరో వ్యక్తితో కలిసి మోటారుసైకిల్‌పై తంటి కొండ వైపు నుంచి గోకవరం వైపునకు వస్తుండగా గుర్తుతెలియని వాహనం ఢీకొట్టింది. ఈ ఘటనలో శ్రీనివాస్ అక్కడి కక్కడే మృతి చెందాడు. బైక్‌పై ప్రయాణం చేస్తున్న మరో వ్యక్తి తీవ్రంగా గాయప డ్డాడు. కాగా శ్రీనివాస్ తాపీ పని చేసుకుంటున్నాడని, అతడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారని సమాచారం.

గండిపోశమ్మ తల్లి దర్శనాలు పునఃప్రారంభం

దేవిపట్నం, మార్చి 10: మాతృశ్రీ గండిపోశమ్మ తల్లి అమ్మవారి దర్శనాలు ఆదివారం నుంచి పునఃప్రారంభమయ్యాయి. పోలవరం ప్రాజెక్టు నిర్మాణంవల్ల బ్యాక్ వాటర్‌లో సుమారు 8 నెలలపాటు పూర్తిగా నీటమునిగిన అమ్మవారి ఆలయం భక్తుల దర్శనానికి పూర్తిగా దూరమైంది. ఆలయం వద్ద ఇటీవల బ్యాక్ వాటర్ తగ్గడంతో సంప్రోక్షణతో తిరిగి ఆలయాన్ని ప్రారంభించినట్లు కార్యనిర్వహణాధికారి తెలిపారు.

సినిమా గైడ్

కొవ్వూరు	
యువరాజ్‌మాల్ వై.స్క్రీన్ 1	సిద్ధార్థ్‌రాయ్
వై.స్క్రీన్2	ఈగల్
దేవిశ్రీ(గాయత్రి)	హనుమాన్
అనన్య	ఊరి పేరు భైరవ కోన
నిడదవోలు	
వీ మ్యాక్స్	ఊరి పేరు భైరవ కోన
రాధాకృష్ణ	ఆపరేషన్ వాలంటైన్
శ్రీగణపతి	వ్యూహం
దేవరపల్లి	
శ్రీరామ్ సినీ మ్యాక్స్	గుంటూరు కారం
శ్రీరామ్ సినీ మ్యాక్స్	గుంటూరు కారం
నల్లజర్ల	
శ్రీలక్ష్మి మల్టీప్లెక్స్	సలార్
శ్రీనివాస	సలార్